ప్రజాశక్తి

శనివారం 11 మే 2024 1

అనంతపురం శ్రీ సత్యసాయి

ప్రచారానికి నేడే ఆఖరు...!

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సమయం ఆసన్నమవుతోంది. ఏప్రిల్ 29వ తేదీ నుంచి మొదలైన ప్రచారాలకు నేటి సాయంత్రంతో తెరపడనుంది. మరో 72 గంటల్లో ఓటింగ్ మొదలవనుంది. దీంతో అభ్యర్థులు చివరి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. మైకులు సాయంత్రం ముగబోయేలోపు డబ్బులను కూడా ఓటర్లకు చేర్చే ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. ఓటుకు వెయ్యి నుంచి రెండు వేల రూపాయలు పంపిణీ జరుగుతోంది. ఎలాగైనా గెలవాలన్న తలంపుతో ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ ఎత్తుకు పైఎత్తులు వేస్తూ ముందుకు సాగుతున్నారు.

◆ సాయంత్రం నుంచి మద్యం దుకాణాలు మూసివేత

◆ జోరుగా సాగుతున్న పంపకాలు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అనంతపురం జిల్లాలో అనంతపురం పార్లమెంటుకు 21 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, 113 మంది అభ్యర్థులు ఎనిమిది అసెంబ్లీలకు బరిలో ఉన్నారు. సత్యసాయి జిల్లాలో 13 మంది హిందూపురం పార్లమెంటు బరిలో ఉండగా, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు 78 మంది అభ్యర్థులు బరిలోనున్నారు. ప్రధాన పార్టీలతోపాటు, స్వతంత్ర అభ్యర్థులు అనేక చోట్ల పోటీలో నిలిచారు. వీరందరూ ఏప్రిల్ 29వ తేదీ నుంచి నేటి సాయంత్రం వరకు ఓటర్ల వద్దకెళ్లి ప్రచారాలు చేపట్టారు. ప్రధాన పార్టీల తరుపున ముఖ్య నేతలందరూ ప్రచారాల్లో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తాడిపత్రి, కళ్యాణదుర్గం, హిందూపురం నియోజకవర్గాల్లో ప్రచారం చేశారు. ఇక తెలుగుదేశం పార్టీ తరుపున ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు రాయదుర్గం, అనంతపురం, ధర్మవరం, శింగనమల నియోజకవర్గాల్లో ప్రచారం చేశారు. ఈయనతోపాటు సినీ నటుడు బాలకృష్ణ రాయలసీమ వ్యాప్తంగా ప్రచారం నిర్వహించగా ఆయన తరుపున బాలకృష్ణ భార్య వసుంధర, అక్క భువనేశ్వరి, కూతురు బ్రాహ్మణిలు హిందూపురంలో ప్రచారం నిర్వహించారు. బిజెపి అభ్యర్థి తరుపున ధర్మవరంలో కేంద్ర మంత్రి అమిత్‌షా ప్రచారం చేశారు. ఇండియావేదిక తరుపున కాంగ్రెస్, సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల మడకశిర, శింగనమల, ఉరవకొండ నియోజక వర్గాల్లో ప్రచారం చేపట్టారు. సిపిఎం కేంద్ర పొలిట్ బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబి, సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషాలు అనంతపురంలో సిపిఎం నిర్వహించిన ప్రాంతీయ సభలో పాల్గొన్నారు. ఇలా ప్రచారాలు రెండు వారాల పాటు జోరుగా సాగాయి.

ఓటుకు నోటు..

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలైన వైసిపి, టిడిపిలు ఓటుకు నోట్లు పంపిణీని రెండు రోజులుగా ప్రారంభించారు. కొన్ని చోట్ల ఓటుకు రెండు వేల రూపాయల పంపిణీ చేస్తుండగా, కొన్ని చోట్ల వెయ్యి రూపాయలు పంపిణీ సాగుతోంది. అనంతపురం నగరం లాంటి చోట్ల కొంత మంది మిక్సీలు వంటివి కూడా బహుమతులుగా ఇచ్చారు. ధర్మవరం నియోజకవర్గంలో అయితే ఒక పార్టీ అభ్యర్థి ఏకంగా ఓటుకు ఐదు వేల రూపాయలు కూడా మిగతా 3లో

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్పీ

అప్రమత్తత అవసరం

◆ పోలింగ్ వేళ అన్ని చర్యలూ తీసుకోండి

◆ అధికారులు అత్యుత్తమంగా పనిచేయాలి

◆ ఎన్నికల సాధారణ పరిశీలకులు మనీష్ సింగ్, అజయ్ నాథ్‌ఝ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సాధారణ ఎన్నికల పోలింగ్ సమయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించి అధికారులు విధులు నిర్వహించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు మనీష్ సింగ్, అజయ్ నాథ్‌ఝ తెలియజేశారు. శుక్రవారం నాడు అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సాధారణ ఎన్నికలు - 2024కు సంబంధించి చివరి 72 గంటల ఏర్పాట్లు, పోలింగ్ రోజు ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వి.వినోద్‌కుమార్, ఎస్పీ అమిత్ బర్దర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల సాధారణ పరిశీలకులు మనీష్ సింగ్, అజయ్ నాథ్ ఝ మాట్లాడుతూ జిల్లాలో స్వేచ్ఛగా, శాంతియుతంగా, పకడ్బందీగా ఎన్నికలను నిర్వహించాలన్నారు. రిటర్నింగ్ అధికారులు డీఎస్పీలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఎన్నికల పోలింగ్ వరకు 72 గంటల పాటు పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. అధికారులంతా నమ్మకంతో ఉండాలని, వారి అనుభవాన్ని ఇతర అధికారులతో పంచుకోవాలన్నారు. డబ్బు, మద్యం సరఫరాని పూర్తి స్థాయిలో అడ్డుకోవాలన్నారు. అత్యంత పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల పోలీస్ పరిశీలకులు రవి కుమార్ మాట్లాడుతూ ఎన్నికల వేళ సెబ్, పోలీస్ అధికారులు మరింత ప్రత్యేక దృష్టి సారించి విధులు నిర్వహించాలన్నారు. అక్రమంగా మిగతా 3లో

లేపాక్షిలో నోట్ల కట్టల కలకలం..!

◆ ఓ ఇంటి వద్ద బయటపడ్డ డబ్బు సంచులు

◆ డబ్బును స్వాధీనం చేసుకున్న అధికార పార్టీ నాయకులు..!

రామాంజినమ్మను విచారణ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి జ్యోతిక

ప్రజాశక్తి-హిందూపురం, లేపాక్షి

హిందూపురం నియోజకవర్గం లేపాక్షి మండల కేంద్రం ఇందిరమ్మ కాలనీలో అధికార పార్టీ నేతలకు చెందిన నోట్ల కట్టలు సంచులు బయటపడ్డాయి. శుక్రవారం వేకువజామున ఈ ఘటన కలకలం రేపింది. ఓ ఇంట్లో సుమారు రెండు కోట్ల రూపాయల నోట్ల కట్టలు సంచులు బయటపడ్డాయి. మరో రెండు రోజుల్లో పోలింగ్ జరగతుండడంతో ఓటర్లను డబ్బులతో ఎర వేయడానికి అధికార పార్టీ నేతలు ఈ డబ్బును సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... గురువారం అర్ధరాత్రి చిలమత్తూరు వైపు నుంచి హిందూపురం వైపునకు అధికార పార్టీ నేతకు చెందిన ఓ కారు డబ్బు సంచలతో లేపాక్షిలోకి వెళ్లింది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న పోలీసు వాహనం సైరన్ మోగడంతో అప్రమత్తమైన కారు డ్రైవర్ రోడ్డు పక్కనే ఉన్న ఇందిరమ్మ కాలనీలోకి కారును మళ్లించాడు. వెంటనే మిగతా 3లో

శింగనమల వైసిపిలో ఆగని అసమ్మతి

◆ నార్పలలో మరోసారి బహిర్గతమైన విభేదాలు

◆ రోడ్డు షోకు నాయకులు దూరం

నార్పలలో సత్యనారాయణ ఇంటి వద్ద గుమిగూడిన వైసిపి మద్దతుదారులు

ప్రజాశక్తి-నార్పల

శింగనమల వైసిపిలో అసమ్మతి జ్వాల చల్లారలేదు. పోలింగ్‌కు గంటల వ్యవధి ఉన్న సమయంలో కూడా ఆపార్టీ నేతల మధ్య విభేదాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. అధిష్టానం నాయకులను ఒకతాటిపైకి తెచ్చేందుకు ఎంత ప్రయత్నించినా అవిఫలితాలను ఇచ్చినట్లు కన్పించడం లేదు. శుక్రవారం ఉదయం వైసిపి అభ్యర్థి వీరాంజనేయులు నార్పలలో రోడ్ షో నిర్వహించారు. రోడ్‌షో నార్పల మసీదు వద్దకు సీనియర్ నాయకులు సత్యనారాయణరెడ్డితో కలిసి అభ్యర్థి వీరాంజనేయులు వెళ్లాడు. ఈసమయంలో కొందరు వైసీపీ నాయకులు మసీదు వద్దకు వెళ్లలేదు. అనంతరం రోడ్ షో ప్రారంభం కాగానే కొందరు నాయకులు జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్య, అభ్యర్థి వీరాంజనేయులుతో కలిసి రోడ్ షోలో పాల్గొన్నారు. ఒకరు కలిసిన చోట మరో నాయకుడు కలవకుండానే రోడ్‌షో సాగింది. నాయకులు అందరినీ కలుపుకుని మిగతా 3లో

ముస్లిములు వైసిపిని ఆదరించాలి

నార్పల : ముస్లిములకు ఎంతో మేలు చేసిన వైసిపిని వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు, సీనియర్ నాయకులు నార్పల సత్యనారాయణ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని జామియా మసీదు, ఈద్గా మసీదు పరిసరాల్లో ప్రార్థనా అనంతరం ముస్లిములను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత సిఎం వైఎస్ఆర్ ముస్లిముల అభ్యున్నతి కోసం నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. ఈ రిజర్వేషన్ కొనసాగి భవిష్యత్ తరాల విద్యార్థులకు ఉండాలంటే ప్రతి ఒక్కరూ వైసిపికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు లోకనాథ్‌రెడ్డి, ఖాదరవలి ఖాన్, అమీర్‌బాషా, దాడితోట బాషా, మాజీ ముత్తువల్లి ఇక్బాల్‌బాషా, జిలాన్‌బాషా, హాజీ, ఫయాజ్‌బాషా, మౌలానా, జిక్రియా, మైనార్టీ యూత్ నాయకులు సోహెల్‌నౌషాద్, ఇంతియాజ్, దాదాపీర్, జావేద్, దాదు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రంలో సంక్షేమం

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై. వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

సీఎం జగన్‌తోనే రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో భారీ ప్రచార ర్యాలీ నిర్వహించారు. శ్రీకష్ణదేవరాయలు సర్కిల్ నుంచి గాంధీ కూడలి, సిఎస్ఐ చర్చి, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా గాంధీచౌక్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన నవరత్న పథకాల ద్వారా పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. కావున ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా ఎం.శంకరనారాయణను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిబి.మంజునాథ్‌రెడ్డి, బి.శ్రీనివాస్‌రెడ్డి, కోనా మురళీధర్‌రెడ్డి, క్రషర్ మధుసూదన్‌రెడ్డి, డి.హుస్సేన్‌పీరా, గోవర్ధన్‌రెడ్డి, బి.రమేష్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

పామిడి : వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.వెంకటరామిరెడ్డి పట్టణంలోని మానస లాడ్జి నుంచి బొడ్రాయి మీదుగా ఎద్దులపల్లి రోడ్డు వరకూ రోడ్‌షో నిర్వహించారు. వైసిపి శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా వైవిఆర్ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని ఇప్పటికే అభివృద్ధి చేశామని, మరింత అభివృద్ధి చేయాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెమ్మక చెన్నకేశవరెడ్డి, కొండాపురం సునీల్‌రెడ్డి, బోగాతి మురళీమోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాగూర్ ఈశ్వర్‌రెడ్డి, మూలింటి నాగేశ్వర్‌రెడ్డి, జోజోడే కుమార్, పాల్యం నారాయణరెడ్డి, సాకే ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అభివాదం చేస్తున్న వై.వెంకటరామిరెడ్డి

పలువురు వైసిపిలో చేరిక

స్థానిక వైసిపి కార్యాలయంలో గుత్తి మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో గజరాంపల్లి గ్రామస్తులు శుక్రవారం వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా చెన్నకేశవరెడ్డి వీరికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి దివాకర్, రమణారెడ్డి (రామారావు), రమేష్, నాగేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి స్కిల్ పోటీలకు కదరంపల్లి తిలక్

అనంతపురం : రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్కిల్ పోటీల్లో అనంతపురానికి చెందిన కదరంపల్లి తిలక్ ఎంపికయ్యారు. మే 7, 8 తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఎపి ఎస్ఎస్‌డిసి నిర్వహించిన రాష్ట్రస్థాయి నైపుణ్య పోటీల్లో అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్ నైపుణ్యంలో తిలక్ అద్భుతమైన ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. దీంతో మే 14 నుంచి 19వ తేదీ వరకూ న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి నైపుణ్యాల పోటీల్లో తిలక్ పాల్గొననున్నారు. ప్రస్తుతం తిలక్ కేఎల్ యూనివర్సిటీలో మెకానికల్ ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్నారు. తిలక్ జాతీయ స్థాయిలోనూ రాణించి దేశానికి ఉపయోగపడాలని తల్లిదండ్రులు గిరిజాకళ్యాణి, శ్రీనాథ్‌శాస్త్రి ఆకాంక్షించారు.

దేశానికి ప్రాతినిథ్యం నా కల : తిలక్

దేశానికి ప్రాతినిథ్యం వహించడం తన కల అని తిలక్ అన్నారు. జాతీయ స్థాయి నైపుణ్య పోటీలకు ఎంపికవటం సంతోషంగా ఉందన్నారు. ఇదేస్ఫూర్తితో రాణించి దేశం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు.

ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో ప్రచారం

పెద్దవడుగూరు : ఎన్‌డిఎ అభ్యర్థి జెసి అస్మిత్‌రెడ్డికి మద్దతుగా ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ర్యాలీ, ప్రదర్శనగా వెళ్లి వచ్చే ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు పెద్దిరాజు, జిల్లా వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ అదినారాయణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామాంజనేయులు, మండల నాయకులు భూపతి, కత్తుల కొండయ్య, రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బసవ జయంతి

పెద్దవడుగూరు : బసవ జయంతి వేడుకలను వీరశైవ లింగాయతులు మండల కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా వీరశైవ లింగాయతులు మాట్లాడుతూ బసవేశ్వరుడు గత 800 సంవత్సరాల క్రితమే కుల, వర్ణ, లింగ బేధాలు లేవని, అందరం సమానమేనని చాటిచెప్పారన్నారు. బసవేశ్వరుడు ప్రత్యేక వీరశైవ మతాన్ని స్థాపించిన గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు.

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో శుక్రవారం అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. ట్రస్టు సభ్యులు, నేతాజీ పాఠశాల టీచర్ అనూరాధ, మరో ట్రస్టు సభ్యులు, తుముకూరుకు చెందిన వాణిశ్రీ, బద్రీనాథ్ మనవరాలు బ్రింద, మనుమడు శౌర్య పుట్టినరోజు సందర్భంగా అన్నదానానికి సహకరించినట్లు ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సోదామణి, సుబ్రమణ్యం, ఓబుళపతి, సుబ్బారావు, జగన్నాథ్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న నిత్యసురభి ట్రస్టు సభ్యులు

ఎన్నికల ప్రలోభాలు టిడిపికే సొంతం

వైసిపి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు రమణ

ప్రజాశక్తి-వజ్రకరూరు

మాట్లాడుతున్న వైసిపి ఎన్నికల పరిశీలకులు రమణ

ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం టిడిపి అధినేత చంద్రబాబు, ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్‌కే సొంతమని వైసిపి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు రమణ విమర్శించారు. శుక్రవారం ఉరవకొండలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గవ్యాప్తంగా గతనెలలో టిడిపి నాయకులు రూ.50 విలువజేసే చీరలు పంపిణీ చేసింది వాస్తవం కాదా.. అని నిలదీశారు. 2019లో అధికారాన్ని అడ్డుపెట్టుకుని అన్ని ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది, అధికారులతో మీరు చేసిన ప్రలోభాలు ప్రజలు ఇప్పటికీ మరిచిపోలేదన్నారు. ఐదేళ్లలో రాష్ట్రంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి వైసీపీ ప్రభుత్వ విజయానికి సోపానాలన్నారు. ఆరోగ్యం బాగాలేదని తెలుసుకుని మాజీ ఎంపిపి చంద్రమ్మను కొందరు యానిమేటర్లు మానవీయ కోణంలో పరామర్శించడం తప్పా.. కేశవ్.. అంటూ ప్రశ్నించారు. ఓడిపోతానన్న భయంతోనే పయ్యావుల కేశవ్ ఆబాండాలు వేస్తున్నారన్నారు. పరామర్శించడానికి వెళ్లిన యానిమేటర్లపై చర్యలు తీసుకునేందుకు అధికారులపై ఒత్తిడి తీసుకురావడం బాధాకరమన్నారు. కేశవ్ పద్ధతి మార్చుకోకపోతే తమకు కూడా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయడం తెలుసు అని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపిపి చంద్రమ్మ, మార్కెట్ యార్డు ఛైర్మన్ సుశీలమ్మ, సర్పంచి లలిత, వార్డ్ సభ్యురాలు లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి 'అమ్మ' ఆర్థికసాయం

ప్రజాశక్తి-అనంతపురం

ఆపదలో ఉన్న బాధిత కుటుంబానికి అమ్మ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు తరిమెల రమణారెడ్డి రూ.4 లక్షలు ఆర్థికసాయం చేసి మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని బుడ్డప్పనగర్‌లో నివసిస్తున్న తలారి రంగన్న రిక్షా తొక్కుతూ, తన భార్య లక్ష్మమ్మ కర్పూరం ఫ్యాక్టరీలో పని చేసుకుంటూ జీవనం సాగించేవారు. వీరికి ఇద్దరు పిల్లలకు కాగా హాస్టల్‌లో చదువుకుంటున్నారు. ఈనేపత్యంలో లగేజీ వేసుకుని రిక్షా తొక్కుతూ వెళుండగా ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొనడంతో వెన్నెముక, ఎడమకాలు దెబ్బతినడంతో రంగన్న మంచానికి పరిమితమాయ్యడు. తన భార్య కు వచ్చే కూలీ డబ్బుతో జీవనం సాగించడం, ఇద్దరి పిల్లల చదువులకు డబ్బు లేక చదువు ఆగిపోయింది. అంతేగాకుండా రంగన్నకు బెంగుళూరు సెయింట్ జాన్ ఆసుపత్రిలో పరీక్షలు చేయించగా వెన్నెముకకు ఆపరేషన్ చేస్తే తిరిగి తన పని చేసుకోవచ్చని, అయితే రూ.3లక్షలు ఖర్చు అవుతుందని చెప్పారు. ఈనేపథ్యంలో ఓ డాక్టర్ సలహా మేరకు అమ్మ సంస్థ అధ్యక్షులు తరిమెల రమణారెడ్డిని ఆశ్రయించగా రూ.4లక్షలు అందజేశారు. దీంతో రమణారెడ్డికి రంగన్న కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేస్తున్న రమణారెడ్డి

బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం : స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల పరిధిలో నిర్వహించిన బిటెక్ 4వ సంవత్సరం 2వ సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్ పరీక్షలు ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వి సత్యనారాయణ తెలిపారు. ఫలితాల కోసం కళాశాల అకాడిమిక్ సెక్షన్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, డిప్యూటీ కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్స్ డి.విష్ణు వర్ధన్, డి.లలితకుమారి, విభాగాల అధిపతులు కెఎఫ్.భారతి, ఎం.రామశేఖరరెడ్డి, ఓం ప్రకాష్, దిలీప్‌కుమార్, డాక్టర్ కళ్యాణి రాధా, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని బొందలవాడ గ్రామంలో టిడిపి నాయకులు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు మాట్లాడుతూ వైసిపి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక సమస్యలపై ప్రభుత్వాన్ని అడిగిన పాపానికి కేసులు పెట్టి వేధించడంతో సుమారు 3,500 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ఎపికి రూ.12లక్షల కోట్ల అప్పుభారం వేశారన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. సిఎం జగన్ సొంత చెల్లి, తల్లికి న్యాయం చేయలేనివాడు, రాష్ట్ర ప్రజలకు ఏం న్యాయం చేస్తారని ప్రశ్నించారు. మీ పిల్లలకు ఉద్యోగాలు రావాలన్నా, రాష్ట్రం అభివృద్ధి జరగాలన్నా వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి ఎమ్మెల్యేగా బండారు శ్రావణిశ్రీ, ఎంపీ అభ్యర్థిగా అంబికా లక్ష్మీనారాయణను గెలిపించి చంద్రబాబును సిఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, ఆలం కృష్ణమ నాయుడు, చెన్నప్పనాయుడు, మల్లికార్జున, శేషానాయుడు, ఆలం నాగార్జుననాయుడు, ఆలం వెంకటరమణ, నారాయణస్వామి, సోమశేఖర్, వెంకటరాముడు, చిన్న వెంకటరాముడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నార్పల మండలంలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

శింగనమల : మండల పరిధిలోని పెరవలి, గుమ్మేపల్లి, ఏకులనాగేపల్లి గ్రామాల్లో టిడిపి నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు డేగల కృష్ణమూర్తి, మారుతీనాయుడు, రాజు, కాటమయ్య, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండలంలోని తక్కల్లపల్లి, బాలాపురం గ్రామాల్లో ఎన్‌డిఎ కూటమి నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బాలాపురం రామచంద్రారెడ్డి, రాగే రామాంజియాదవ్, రంగయ్య, పుల్లారెడ్డి, రామకృష్ణారెడ్డి, ఎర్రన్న, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు మండలంలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గుత్తి : పట్టణంలోని అనంతపురం రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. అనంతపురం రోడ్డులోని ఓ వేబ్రిడ్జి వద్ద 44వ జాతీయ రహదారిని దాటుతున్న ద్విచక్ర వాహనాన్ని మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో కర్నూలు జిల్లా తుగ్గలి మండలం రామలింగమయ్య గ్రామానికి చెందిన శ్రీహరి అతని అల్లుడు లోకేష్, గుత్తి పట్టణానికి చెందిన జగదీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యుల సూచన మేరకు శ్రీహరిని అదనపు చికిత్స కోసం అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కూటమికి మద్దతుగా ప్రచారం

ప్రచారం చేస్తున్న చిలకం మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరంలో కూటమి అభ్యర్థులకు మద్దతుగా విస్తృత ప్రచారాలు జరుగుతున్నాయి. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి బికె.పార్థసారధి, ధర్మవరం ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్‌ను గెలిపించాలని కోరుతూ పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ధర్మవరం ప్రశాంతంగా ఉండాలన్నా, అభివృద్ధి చెందాలన్నా వైసిపిని గద్దెదింపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బెస్త శ్రీనివాసులు, అడ్డగిరి శ్యాంకుమార్, రాజారెడ్డి పాల్గొన్నారు. ఎస్టీ సాధన కోసం వాల్మీకులు అందరూ ఏకమై కూటమి అభ్యర్థిని గెలిపించాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ధర్మవరం టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వాల్మీకులు కూటమికి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు సాకే మద్దిలేటి, గొట్లూరు శీన, బొట్టుకిష్ట, జింకల రాజన్న, చీమల నాగరాజు, పూజా మొబైల్స్ సాయి, మరుస హరి, టైలర్ గోపాల్, చీమల జయ, దుర్గేశ్, రమణ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశాం: డిఆర్ఒ

అనంతపురం కలెక్టరేట్ : ఎండ వేడిమి, వడగాల్పులు దృష్ట్యా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేశామని డిఆర్ఒ రామకృష్ణారెడ్డి తెలియజేశారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో శుక్రవారం నాడు వడగాలులు తదితర అంశాలపై డిపిఎం ఆనంద్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. సాధారణ ఎన్నికలు - 2024 కు సంబంధించి ఈనెల 13వ తేదీన ఎన్నికల పోలింగ్ జరగనుందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కూడా బ్యారికేడింగ్‌తో పాటు షేడ్, షామియనా ఏర్పాటు చేశామన్నారు. ఎండవేడమి తీవ్రత నేపథ్యంలో జిల్లాలోని 2,236 పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఎండవేడమి ఎక్కువగా ఉండడంతో చిన్నపిల్లలు బయట తిరగరాదన్నారు. ఎండ తీవ్రతకు గురి కాకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలన్నారు.

పల్లె ఆధ్వర్యంలో టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి మండల పరిధిలోని కొట్లపల్లి గ్రామంలో పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నాడు పలువురు టిడిపిలోకి చేరారు. కొట్లపల్లి టిడిపి నాయకులు కంసల నారాయణస్వామి ఆధ్వర్యంలో వైసిపిని వీడి టిడిపిలో చేరారు. కొట్లపల్లికి చెందిన సిఆర్. వెంకటరామిరెడ్డి, సంజీవరెడ్డితో పాటు పలు కుటుంబాలు చేరినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో పల్లె రఘునాథ్ రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలోకి వచ్చిన వారికి సముచిత స్థానం ఉంటుందని, పల్లె రఘునాథ్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మండల కన్వీనర్ విజయ్ కుమార్, నారాయణస్వామి, బుగ్గపల్లి నాగరాజు, జగన్, రామాంజనేయులు, నేతమప్ప, మాజీ సర్పంచి రామ సుబ్బారెడ్డి, పెద్దప్పయ్య, నాగిరెడ్డి పాల్గొన్నారు.

సమస్యాత్మక కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

రెండు రోజుల్లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. శుక్రవారం నాడు నల్లమాడ, ఓడిసి, ఆమడగూరు మండలాల్లోని సమసాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లపై అక్కడి సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని, ఆయన పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు -2024 దష్ట్యా ప్రజలు ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా వినియోగించుకునే విధంగా పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు. ప్రజలెవరూ గొడవలకు పాల్పడొద్దన్నారు. అల్లర్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు నిర్భయంగా ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నల్లమాడ సిఐ రాజేంద్రనాథ్ యాదవ్, ఎస్ఐలు రమేష్‌బాబు, వంశీకృష్ణ, మక్బుల్ సిబ్బంది ఉన్నారు.

'పురం' రూపురేఖలు మారుస్తా

ప్రతి ఇంటికీ లక్ష రూపాయల లబ్ధి - బహిరంగ సభలో స్వతంత్ర అభ్యర్థి పరిపూర్ణానంద స్వామి

బహిరంగ సభలో ప్రసంగిస్తున్న పరిపూర్ణాంద స్వామి

ప్రజాశక్తి-హిందూపురం

స్వతంత్ర అభ్యర్థిగా తనను గెలిపిస్తే హిందూపురం రూపురేఖలు మారుస్తానని హిందూపురం ఎమ్మెల్యే స్వతంత్ర అభ్యర్థి పరిపూర్ణానంద స్వామి తెలియజేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం వాల్మికి విగ్రహంకు పూల మాల వేసి అక్కడి నుంచి పరిపూర్ణానంద స్వామి వేలాది మందితో కలిసి అంబేద్కర్ సర్కిల్ వరకు రోడ్ షో నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్ లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ స్వతంత్ర అభ్యర్థిగా తనను గెలిపిస్తే హిందూపురంలోని 40వేల ఇళ్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో సంబంధం లేకుండా ప్రతి ఇంటికీ రూ.1లక్ష లబ్ధి చేకూరుస్తానన్నారు. దీంతో పాటు 150 యూనిట్ లు ఉచితంగా కరెంటు అందిస్తానన్నారు. ప్రతి ఇంటికి రోజుకు 40 లీటర్ల శుద్ధ జలాన్ని అందిస్తానని, హిందూపురాన్ని సిల్క్ సిటీగా మారుస్తానన్నారు. 40 సంవత్సరాల టిడిపి పాలనలో పట్టణంలో ప్రతి ఇంటికి నీళ్లు సైతం ఇవ్వని స్థితి ఉందన్నారు. రాజకీయ రంగంలో పార్టీలన్నీ తనను ఒంటరి వాడిని చేసి, నడి రోడ్డుపై వదిలేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఆలోచన చేసి బానిసత్వానికి ఓటు వేస్తారా.. బాగుపడడానికి వేస్తారా తేల్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లం నరేష్, చారు కీర్తితో పాటు పరిపూర్ణానందస్వామి అభిమానులు పాల్గొన్నారు.

చెరవులను నింపాలి

హిందూపురం : హిందూపురం సమగ్ర అభివద్ధికి ఈ ప్రాంత చెరువులను హంద్రీనీవా జలాలతో నింపాలని జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు రామకష్ణ, డాక్టర్ ఈటి.రామ్మూర్తి, డాక్టర్ వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పీపుల్స్ మేనిఫెస్టో బుక్ లెట్ లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు విద్యా వైద్య రంగాలకు బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలన్నారు. ఆరోగ్యాన్ని ప్రజల హక్కుగా చట్టబద్ధం చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ కు సంబంధించి విభజన హామీలను, ప్రత్యేక హెూదాను అమలు చేయాలన్నారు. హిందూపురం ప్రాంతంలో ఉన్న చెరువులను హంద్రీనీవా జలాలతో నింపి ఈ ప్రాంత రైతులకు సమద్ధిగా సాగు జలాలను అందించాలన్నారు. హిందూపురంలో ఐటీ పార్క్ ఏర్పాటు చేయాలని, రింగ్ రోడ్డు నిర్మించడంతోపాటు భూగర్భ మురికి కాలువ వ్యవస్థలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి ప్రతినిధులు రవీంద్రారెడ్డి, శ్రీనివాసులు, ఉమామహేశ్వర్, ఉగ్రప్ప, జియావుల్లా, ఆనంద్ రెడ్డి, కోదండరాములు, నాగరాజు గుప్త, నాగిరెడ్డి, అతావుల్లా, ఓబులేసు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే దళితుల అభివృద్ధి

ధర్మవరం టౌన్ : దళితులు బాగుండాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని టీడీపీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు రేగాటిపల్లి వరదరాజులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దళితులు స్వేచ్ఛగా తలెత్తుకుని తిరగాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం ఎంతో అవసరమన్నారు.

మహారాజశ్రీ కదిరి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, కదిరి
O.S.No. 724/2019
Between:
సానే రామకృష్ణారెడ్డి S/o నాగిరెడ్డి, D.No:1-1/35-69-D, అడపాల వీధి, కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా. ...వాది
V/S
పిట్టీల మధు మరియు ఒకరు ...ప్రతివాదులు
1వ ప్రతివాదికి దావా సమను
పై దావాలోని వాదికికి, ప్రతివాదులు వ్రాసియిచ్చిన ప్రాంసరి బాకీ వసూలు నిమిత్తమై మీ యిరువురిమీదా దావా వేసి వున్నాడు. దావాలో 1వ ప్రతివాది అయిన పట్టీల మధు S/o రామచంద్ర D.No:5-45-2A అడపాల వీధి, కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా.అయిన మీ హాజరు నిమిత్తమై పై కోర్టు వారు 17/05/2024 వ తేదిన వాయిదా వేసి ఉన్నారు. కావున మీరు 17/05/2024 వ తేదిన ఉదయం 10:30 గం॥లకు స్వయంగా గాని, లేక వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరు కావలెను. అట్లు హాజరు కాని పక్షంలో పై దావాను మీ పరోక్షమున తీర్మానము చేయుదురని ఇందుమూలంగా తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:17/05/2024
స్థలం:కదిరి
కె.అంజుం బాషా,
వాదితరుపు వకీలు, కదిరి.

మొదటి పేజి తరువాయి

ప్రచారాలకు నేడే ఆఖరు

పంపిణీ చేసినట్టు ప్రచారం నడుస్తోంది.

మద్యం దుకాణాలు బంద్

ఎన్నికలకు 72 గంటల ముందు నుంచే మద్యం దుకాణాలు మూసేయనున్నట్టు అధికారులు ప్రకటించారు. నేటి సాయంత్రంతో బంద్ కానున్నాయి. దీంతో శుక్రవారం సాయంత్రం నుంచే మద్యం దుకాణాలు కిటకిటలాడాయి. రెండు రోజులకుపైగా మద్యం అందుబాటులో ఉండదనేసరికి ఇళ్లలో ముందుగా స్టాకు పెట్టుకునేందుకు మద్యం బాబులు సిద్ధం అయ్యారు.

అప్రమత్తత అవసరం

మద్యం, డబ్బు రవాణా చేస్తున్నట్లు ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల్లో రౌడీషీట్ ఉన్న వారి పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టిలు మరింత సమన్వయంతో పని చేసి పోలింగ్ పూర్తయ్యే వరకు ప్రతి వాహనాన్ని తనిఖీలు చేయాలన్నారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల పోలింగ్ కు ముందు 72 గంటలు, పోలింగ్ రోజు చేపట్టాల్సిన ఏర్పాట్లపై పకడ్బందీ చర్యలు తీసుకున్నామన్నారు. 100 శాతం ఎన్నికలను స్వేచ్ఛగా, శాంతియుతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎస్పీ అమిత్ బర్దర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సిఎపిఎఫ్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. లాడ్జిలు, గెస్ట్ హౌస్ లు, కళ్యాణ మండపాలు, కమ్యూనిటీ హాళ్లను తనిఖీ చేస్తున్నామన్నారు. ఎలాంటి గొడవలు లేకుండా సజావుగా పోలింగ్ నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. ఈ సమావేశంలో సీఈవో వైఖోమ్ నిదియా దేవి, డిఎఫ్‌వో వినీత్ కుమార్, డిఆర్ఒ జి.రామకష్ణారెడ్డి, అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్ రెడ్డి, నోడల్ అధికారులు అరుణకుమారి, డా॥ఈబి.దేవి, సత్యరాజ్, నాగయ్య, ఉమామహేశ్వరమ్మ, భాస్కర్‌తో పాటు వివిధ నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

శింగనమల వైసిపిలో ఆగని అసమ్మతి

రోడ్ షో నిర్వహించాలని జిల్లా వైసిపి అధిష్టానం భావించినా ఆ మేరకు ఫలితాలు రాలేదు. విభేదాల నడుమ రోడ్‌షో కొనసాగుతోందన్న విషయం తెలుసుకున్న ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి వెంటనే నార్పలకు చేరుకున్నారు. సత్యనారాయణ రెడ్డి ఇంటి వద్దకు వెళ్లి ఆయన్ను రోడ్ షోకు రావాలని కోరారు. ఈ సమయంలో కొందరు ద్వితీయ శ్రేణి నాయకులు పార్టీలో తమకు జరుగుతున్న అవమానాలను భరించలేకున్నామంటూ సాంబశివారెడ్డి వద్ద అసహనం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో అసమ్మతి నేతలు ఒకరిపై ఒకరు వాదులాడుకున్నారు. జిల్లా నాయకత్వం ఓ వర్గం వారిని ప్రోత్సహిస్తూ మరో వర్గం వారిని కావాలనే నిర్లక్ష్యం చేస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. దీంతో సత్యనారాయణ ఇంటి వద్ద కొంత సేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తాము రోడ్‌షోలో పాల్గొనమని కొందరు నాయకులు తెగేసి చెప్పారు. సత్యనారాయణరెడ్డి కలుగుజేసుకుని అక్కడున్న వారిని సముదాయించి ర్యాలీకి తీసుకెళ్లారు. నాయకులు రోడ్‌షోలో పాల్గొన్నా చాలా మంది ఎడమొహం, పెడమొహంగానే కన్పించారు. వైసిపిలో నెలకొన్న ఈ అసమ్మతి పోలింగ్ రోజున ఎలాంటి పరిస్థితి తెస్తుందోనని ఆ పార్టీ శ్రేణులను కలవరపెడుతోంది.

లేపాక్షిలో నోట్ల కట్టల కలకలం..!

కారులో ఉన్న నాలుగు డబ్బు సంచుల్లో రెండు సంచులను తీసి ఓ ఇంటి సమీపంలో ఉన్న ముళ్లపొదల్లో విసిరేసి అక్కడి నుంచి వారు పారిపోయారు. కారు వచ్చిన శబ్దం, సంచులు పడేసిన శబ్ధంతో కాలనీలో పక్కనే నివాసం ఉంటున్న రామాంజినమ్మ, సాధికలు అక్కడికొచ్చి చూశారు. కొద్ది సేపటికి పడేసిన వ్యక్తులు కూడా అక్కడికి వచ్చి చూశారు. పడేసిన సంచులు అక్కడ లేకపోవడంతో అర్ధరాత్రి అయినా నిద్ర పోకుండా మేల్కొన్న రామాంజినమ్మ, సాధికలను సంచుల గురించి ఆరా తీశారు. తమకేమీ తెలియదని వారు చెప్పడంతో అక్కడి నుంచి వెళ్లి పోయారు. సంచులు అక్కడే వేశామంటూ అధికార పార్టీ నాయకులు మొత్తం అక్కడే వెతికారు. చివరకు అర్ధరాత్రి వరకు మేల్కొన్న ఇద్దరు మహిళలు ఆ డబ్బును తీసి వేరే చోట పెట్టినట్లు తెలుసుకున్నారు. వెంటనే అక్కడికి చేరుకున్న అధికార పార్టీ హిందూపురం ఎన్నికల పరిశీలకుడుతోపాటు మరో ముఖ్యనేత, మండల ముఖ్య నాయకునితో కలిసి పెద్దఎత్తున హడావుడి చేసి ఆరా తీశారు. దీంతో సంచుల్లో ఉంచిన రెండు కోట్ల వ్యవహారం బయట పడింది. రామాంజినమ్మ, సాధికలను స్థానిక నాయకులు బెదరించడంతో వారు ఒక సంచిని వైసిపి నాయకులకు ఇచ్చేశారు. మరో సంచి గురించి అడగ్గా తమకు తెలియదని సమాధానం ఇచ్చారు. వీరి మాటను నమ్మని వైసిపి నాయకులు రామాంజినమ్మ ఇంట్లో సోదాలు చేయడంతో కొంత డబ్బులు దొరికాయి. ఇంకా సోదాలు చేయడంతో ఆమె ఆత్మహత్య చేసుకోవాడానికి ప్రయత్నం చేసింది. దీంతో వారు అక్కడి నుంచి బయటకు వచ్చేశారు. చివరకు ఆ మహిళ ఇంట్లో రూ.60 లక్షల వరకు నగదు దొరికింది. దీంతో అధికార పార్టీ నాయకులు ఊపిరి పీల్చుకున్నారు. మిగిలిన డబ్బులు కోసం అధికార పార్టీ నాయకులు ఆరా తీస్తున్నారు. డబ్బుల వ్యవహారం ఇంత పెద్ద ఎత్తున ఆ ప్రాంతంలో జరుగుతున్నా పోలీసులు, ఎన్నికల అధికారులెవరూ అక్కడికి రాకపోవడం గమనార్హం. చివరకు అంతా ముగిసిన అనంతరం ఫ్లయింగ్ స్క్వాడ్ జ్యోతిక, కానిస్టేబుల్ జనార్ధాన్ అక్కడి చేరుకుని రామాంజినమ్మ అనే మహిళను విచారించారు. డబ్బు సంచులు ఎవరు తెచ్చారని ప్రశ్నించడంతో వైసిపికి చెందిన అంజన రెడ్డి, నారాయణ స్వామి, నిసార్ మరికొంత మంది పేర్లను ఆమె తెలియజేసింది.

కాగా గురువారం అర్ధరాత్రి సమయంలో లేపాక్షి మండలం చోళసముద్రం టోల్ ప్లాజ వద్ద అధికార పార్టీ ముఖ్య నాయకుడు సుమారు రూ.5 కోట్లను కారులో తీసుకు వచ్చినట్లు తెలుస్తోంది. అక్కడ పోలీసులను గమనించి, రోడ్డు పక్కన కారు ఆపి, రోడ్డులో కొన్ని సంచుల డబ్బు పడేసి, తిరిగి వచ్చి అక్కడ చూస్తే రూ.50లక్షల ఒక సంచి కనబడకుండా పోయినట్లు తెలుస్తోంది. ఇలా గురువారం అర్ధరాత్రి లేపాక్షి మండలంలో అధికార పార్టీకి చెందిన నోట్ల కట్టల వ్యవహారం కలకలం రేపింది. ఇంత పెద్దఎత్తు డబ్బుల వ్యవహారం దావానంలో వ్యాపించినా ఎన్నికల అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఈ డబ్బుల సంచుల వ్యవహారం నడిపిన వారంతా అధికార పార్టీ నేతలు కావాడంతోనే అధికారులు చర్యలు తీసుకోడానికి వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది.

ప్రజాశక్తి
www.prajasakti.com
అనంతపురం
శనివారం 11
మే, 2024

పార్టీలోకి చేరిన వారితో దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - బుక్కపట్నం

వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమం చూసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీధర్ రెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసిందన్నారు. తిరిగి ప్రజలందరికీ సంక్షేమ పథకాలు దక్కాలంటే వైసీపీ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు రాజంరెడ్డి భాస్కర్ రెడ్డి, సర్పంచి నాగలక్ష్మి రాజు, గోవర్ధన్ రెడ్డి, పతాంజలితో పాటు పెద్ద సంఖ్యలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : టిడిపి నుంచి పలువురు నాయకులు వైసీపీలో చేరారు. శుక్రవారం వైసిపి స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి కండువాలు పార్టీలోకి ఆహ్వానించారు. నల్లమాడ మండలం పాత బత్తలపల్లి గ్రామానికి చెందిన పలువురు వైసీపీలో చేరారు. అలాగే నల్లమాడ మండలం దొన్నికోట గ్రామానికి చెందిన వారు టిడిపి నుంచి సొంతగూటికి వైసీపీలో చేరారు. వారి అందరిని కూడా కండువాలు వేసి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు.

నిజాయితీకి పట్టం కట్టండి

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

సార్వత్రిక ఎన్నికల్లో నిజాయితీగా పాలన చేసే ఎమ్మెల్యేకి పట్టం కట్టాలని పుట్టపర్తి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి, టిడిపి యువ నాయకుడు పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం ఓడి చెరువు మండలం తంగేడు కుంట పంచాయతీలో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరాలని ఓటర్లను అభ్యర్థించారు. టిడిపి అధికారంలోకి వస్తేనే రాష్ట్ర ప్రగతి ఉంటుందన్నారు. నియోజకవర్గంలో అవినీతికి పాల్పడిన వైసీపీ ఎమ్మెల్యేను ఈ ఎన్నికల్లో ఇంటికి పంపాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, బోయపల్లి శివారెడ్డి, నాగరాజు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో పల్లె సింధూరకు ఓటు వేసి అవినీతి ఎమ్మెల్యే అయిన శ్రీధర్ రెడ్డికి గుణపాఠం చెప్పాలని మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పుట్టపర్తి మండల పరిధిలోని రాచువారిపల్లి, కొట్లపల్లి, బుగ్గపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదివరకే ఉద్యోగస్తులంతా పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పారని అన్నారు. అవినీతి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డినీ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : రాష్ట్ర అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని ఆపార్టీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి కుందికుంట వెంకటప్రసాద్ భార్య యశోదమ్మ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని కురమామిడి, మేకల తండా, గొల్లపల్లి, పోతనపల్లి తదితర గ్రామాలలో యశోదమ్మ స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరిగి టిడిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టో వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సి కొండయ్య, నాయకులు అప్పిరెడ్డి వెంకటరమణారెడ్డి, సిఎన్. సుధాకర్, టి సుజన, చంద్రశేఖర్ రెడ్డి, సుధాకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

బాలకృష్ణకు ఓటు వేస్తే మళ్లీ పిఎల పాలనే : వైసిపి

ప్రజాశక్తి - చిలమత్తూరు

ప్రచారంలో పాల్గొన్న దీపిక

సార్వత్రిక ఎన్నికల్లో బాలక్రిష్ణకు ఓటు వేస్తే హిందూపురం నియోజకవర్గంలో మళ్లీ పీఏల పాలనే వస్తుందని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక అన్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం చిలమత్తూరులో రోడ్డు షో నిర్వహించారు. ఈసందర్భంగా దీపిక మాట్లాడుతూ హిందూపురం నియోజక వర్గం లో టీడిపి చెబుతున్న అభివృద్ధి ఎక్కడా లేదని లీడర్లు మాత్రమే అభివృద్ధి అయ్యారని ఆరోపించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను పేదలకు చేరవేస్తుంటే వాటిని కూడ అడ్డుకున్న దుర్మాఘమైన పార్టీ టిడిపి అని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో స్థానికంగా అందుబాటులో ఉండే తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ రాజారెడ్డి, రెడ్డి కార్పొరేషన్ చైర్మేన్ జనార్ధన్ రెడ్డి, అన్సర్, ఎంపిపి పురుషోత్తమ రెడ్డి, సర్పంచి సంధ్య, వైసిపి యువనాయకులు రామక్రిష్ణ రెడ్డి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీ ప్రచారం

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలో టిడిపి, వైసిపి అభ్యర్థులు నందమూరి బాలక్రిష్ణ, దీపిక శుక్రవారం పోటా పోటీగా ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు పాలేపల్లి పల్లి వద్ద ప్రచారంలో ఒకరికొకరు ఎదురుపడటంతో పోలీసులకు ఒకింత తలనొప్పిగా మారింది.వైసిపి కి చెందిన కొందరు ప్రచార వాహనంలో జెండాను ఊపుతూ కవ్వింపు చర్యకు పాల్పడ్డారు. టిడిపి కార్యకర్తలు సైతం చిందులు వేశారు. ఇరు పార్టీలకు చెందిన వారిని నిలువరిస్తూ పోలీసులు క్రాస్ చేయించారు. ఇక మండలంలోని సోమగట్ట, మొరసలపల్లి, పలగలపల్లి, కొడికొండ, చిలమత్తూరులో బాలకృష్ణ ప్రచారం నిర్వహించారు. వైసిపి అభ్యర్థి దీపిక ఎన్నికల ప్రచారంలో భాగంగా మొరసలపల్లి, శెట్టిపల్లి, చిలమత్తూరు లో రోడ్ షో నిర్వహించారు.

సైకో పార్టీని రాష్ట్రం నుంచి తరిమికొడదాం

నందమూరి బాలకృష్ణ

ప్రజాశక్తి - చిలమత్తూరు

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి బాలకృష్ణ

వైసిపి పార్టీ సైకో పార్టీ అని అందుకే ఆ పార్టీని రాష్ట్రం నుండి తరిమికొట్టాల్సిన బాధ్యత ఓటర్లు తీసుకోవాలని టిడిపి హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థి నందమూరి బాలకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారం సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ అచరాక పాలనకు కాలం చెల్లిందన్నారు. భూ యాజమాన్య హక్కు చట్టం పేరిట భూములను పెత్తందారులకు కట్టబెట్టేందుకు వైసిపి కుట్ర పన్నిందని ఆరోపించారు. టిడిపి రూపొందించిన సూపర్ సిక్స్‌లో నవరత్నాలకు మించిన సంక్షేమ పథకాలు ఉన్నాయని అన్నారు. ప్రచారం సందర్భంగా ఎమ్మార్పిఎస్ నాయకులు బేకరి గంగాధర్ బాలయ్య చేతుల మీదుగా "మేలుకో దళితుడా" కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రంగారెడ్డి ,మహిళ నాయకురాలు శ్రీదేవి, జెడ్పీటీసి అనూషా, బాలాజీ, నాగరాజు యాదవ్, నందీశప్ప తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకుడిపై వైసీపీ దాడి

ప్రజాశక్తి -పుట్టపర్తి క్రైమ్

జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి అబ్దుల్లాపై వైసిపి నాయకులు దాడి చేసిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి చిత్రావతి రహదారిలో వాహనాలు నిలిపి గుట్టపైన ఎన్నికల ప్రచారం చేపట్టారు. అదే రహదారిలో నివాసముంటున్న తన ఇంటికి పోవడానికి తన వాహనానికి దారి ఇవ్వమని అబ్దుల్లా కోరగా ఆయనపై ఒక్కసారిగా ఎమ్మెల్యే అనుచరులు దాడికి దిగారు. అంతకుమునుపు అబ్దుల్లా ఒక షార్ట్ ఫిలింలో ఇంటర్వ్యూ ఇస్తూ ఎమ్మెల్యే దోపిడీదారుడని, భూకబ్జాలకు పాల్పడ్డాడని, రియల్ ఎస్టేట్ యజమానులతో డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఇదే అవకాశంగా భావించి అక్కడున్న ఎమ్మెల్యే అనుచరులు దాడికి దిగారని జనసేన నాయకులు విమర్శిస్తున్నారు. దాడి సమయంలో అబ్దుల్లా తో పాటు ఆయన సోదరుడు ఇద్దరు కలిసి పరిగెత్తుకుంటూ పోలీస్ స్టేషన్ కు చేరుకున్నారు. అక్కడ అబ్దుల్లా విలేకరులతో మాట్లాడుతూ తమపై దాడి చేయడం అమానుషమని ఓడిపోతామని భయంతోనే ఎమ్మెల్యే తన అనుచరులతో దాడి చేయించాడని ఆరోపించారు.

పోలీసుస్టేషన్ ఎదుట విలేకరులతో మాట్లాడుతున్న బాధితులు

చిత్రావతి రహదారిలో ఉద్రిక్తత : వైసీపీ అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పట్టణంలో చేపట్టిన ఎన్నికల ప్రచారం ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. శుక్రవారం దుద్దుకుంట తో పాటు ఆ పార్టీ నాయకులు చిత్రావతి గుట్టపైన ఎన్నికల ప్రచారం చేపట్టారు. అయితే స్వయంగా ఎమ్మెల్యేనే అక్కడ కూర్చొని డబ్బులు పంపిణీ చేస్తున్నాడని ఆరోపిస్తూ కొందరు తెలుగు యువత నాయకులు అడ్డుకోవడానికి వెళ్లగా అక్కడ వాదోపవాదాలు జరిగాయి. ఇరువర్గాల మధ్య జరిగిన పరస్పర వాదనలతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఏమవుతుందోనని ఆ ప్రాంత ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. అయితే అక్కడికి చేరుకున్న పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టడంతో పరిస్థితి చక్కబడింది.

అభివృద్ధి, సంక్షేమమే గెలుపునకు సోపానం

పుట్టపర్తి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి సంక్షేమమే తన విజయానికి సోపానమని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీధర్ రెడ్డి 2019 ఎన్నికలలో భారీ మెజార్టీతో గెలుపొందారు. ప్రస్తుతం రెండవసారి బరిలో ఉన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించామని ప్రతి ఇంటికి ఏదో ఒక పథకం అందే విధంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారని ఆయన అన్నారు. దేశంలోనే ఇన్ని సంక్షేమ పథకాలను ప్రకటించిన ముఖ్యమంత్రి ఎవరూ లేరని ఆయన అభివర్ణించారు. తమ ప్రభుత్వం మేలు చేసి ఉంటేనే ఓటు వెయ్యండని ధీమాగా చెప్పిన వ్యక్తి కూడా జగనన్నే అన్నారు. ప్రస్తుత ఎన్నికలలో తన విజయం ఖాయమని శ్రీధర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల ప్రచారంలో శ్రీధర్ రెడ్డితో పాటు ఆయన సతీమణి అపర్ణ రెడ్డి, తనయుడు దుద్దుకుంట కిషన్ రెడ్డి, ఆయన బావమరిది రాఘవరెడ్డి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మరో రెండు రోజులలో పోలింగ్ ఉన్న సందర్భంగా ప్రజాశక్తికి ఆయన ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు అంశాలు పేర్కొన్నారు.

ప్రశ్న : మీ ప్రచారం ఎలా ఉంది? ప్రజల స్పందన ఏమిటి.?

జవాబు : ప్రజల స్పందన బ్రహ్మాండంగా ఉంది. ఏ గ్రామానికి వెళ్లిన ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. గతంలోనే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఇంటిని సందర్శించి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేశాం. తిరిగి ఎన్నికల సమయంలో ప్రతి గ్రామాన్ని సందర్శిస్తూ ఓట్లను అడుగుతున్నాము. ప్రజలు కూడా మరొకసారి ఎమ్మెల్యేగా తనకు అవకాశం ఇస్తారు. అలాగే జగన్ ముఖ్యమంత్రి కావడం ఖాయం.

ప్ర: ఈ ఐదేళ్ల కాలంలో మీరు చేసిన అభివృద్ధి ఏమిటి.?

జ : ప్రధానంగా పుట్టపర్తి కేంద్రంగా శ్రీ సత్యసాయి జిల్లాను తీసుకురావడం జరిగింది. జిల్లాలోని ఎమ్మెల్యేలను అందరినీ కలిసి ఒప్పించి జిల్లా సాధనకు కృషి చేశాం. జిల్లా కేంద్రం ఏర్పడడం వల్ల ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి జరుగుతోంది. దీనికి తోడు జాతీయ రహదారులను దాదాపు రూ. 27 వేల కోట్లతో నిర్మించడం జరుగుతోంది. ప్రధాన రహదారులను కలుపుతూ పుట్టపర్తి మీదుగా అటు బెంగళూరుకు ఇటు విజయవాడకు జాతీయ రహదారులు అనుసంధానం చేయడం జరుగుతోంది. అలాగే నియోజకవర్గంలోని 193 చెరువులకు కృష్ణా జలాలను అందించి ఈ ప్రాంతాన్ని పూర్తిగా సస్యమలం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నా. అందుకు ముఖ్యమంత్రి రూ. 864 కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు. ఇప్పటికే భూమి పూజ జరిగి టెండర్ ప్రక్రియ పూర్తి అయింది. అలాగే నియోజకవర్గ వ్యాప్తంగా 26 వేల వైఎస్ఆర్ గృహ నిర్మాణం చేపట్టడం జరుగుతుంది.

ప్ర : జాతీయ రహదారులకు కేంద్రం నిధులు వచ్చాయే తప్ప ఎమ్మెల్యే చేసింది ఏమీ లేదని విమర్శలపై మీ అభిప్రాయం .?

జ : జాతీయ రహదారులు ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి అవుతుందని తాను ఢిల్లీ చుట్టూ కేంద్ర మంత్రుల చుట్టూ పలుమార్లు తిరిగి సాధించడం జరిగింది. నిధులు కేంద్రానివే అయినప్పటికీ వాటిని సాధించడంలో విజయం సాధించానన్న తృప్తి నాకు ఉంది. విమర్శలు చేసేవారు వారు ఎందుకు రహదారులు తెప్పించలేకపోయారో చెప్పాలని అడుగుతున్నా. 193 చెరువులకు తూతూ మంత్రంగా భూమి పూజ చేయలేదు. ప్రభుత్వ ఆదేశాలతో ముఖ్యమంత్రి జగన్ మంజూరు చేసిన నిధుల వల్ల కృష్ణా జలాలను మళ్లించడం ఖాయం.

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ప్ర : ఈ ఎన్నికల్లో మీ విజయ అవకాశాలు ఎలా ఉండబోతున్నాయి.?

జ : నేను 2019 ఎన్నికలలో దాదాపు 32 వేల మెజార్టీతో గెలుపొందాను. ఈ ఐదేళ్ల కాలంలో ఎంతో అభివృద్ధి చేశాం. వ్యక్తిగతంగా నా దగ్గరికి వచ్చే వారి సమస్యలను పరిష్కరిస్తున్నా. గతంలో కన్నా ఈ ఎన్నికలలో ఎక్కువ మెజార్టీతో గెలవబోతున్నానని ధీమా వ్యక్తం చేస్తున్నాను. ఎన్ని పార్టీలు జతకట్టిన ఇక్కడ గెలిచేది నేనే. ముఖ్యమంత్రి అయ్యేది జగనన్నే.

కష్టాల కదిరి

నిరుపయోగంగా టిడ్కోగృహాలు

నియోజకవర్గ అభివృద్ధిపై ఊసెత్తని పాలకులు
మైనార్టీల సంక్షేమంపై కరువైన హామీ
ఓటు రాజకీయాలకే పరిమితమైన నాయకులు

సార్వత్రిక ఎన్నికలవేళ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు రాజకీయాలు చేస్తున్నారే తప్ప కదిరి నియోజకవర్గ అభివృద్ధిపై స్పష్టమైన హామీ ఏదీ ఇవ్వటం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. జిల్లా సరిహద్దున ఉన్న కదిరి నియోజకవర్గం కష్టాల కడలిలో ఉంది. నియోజకవర్గంలో పలు సమస్యలు రాజ్యమేలుతున్నాయి. చెరువులకు నీరు, ఇళ్లు, రోడ్లు, కళాశాలల ఏర్పాటు తదితర సమస్యలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఈ సమస్యల పరిష్కారానికి పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం ఎన్నికల వేళ అభ్యర్థులు ఓటు రాజకీయాలకే పరిమితమయ్యారని, నియోజకవర్గ అభివృద్ధిపై స్పష్టమైన హామీ లభించడం లేదని నియోజకవర్గ ప్రజలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఐదేళ్లు అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం కదిరి అభివృద్ధి, ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం ఎలాంటి ప్రయత్నాలు చేయలేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటివరకు కదిరి పట్టణ అభివృద్ధి ఏమాత్రం జరగలేదని అంటున్నారు.కదిరి నుంచి రాయచోటి కి వెళ్లే రోడ్డు మార్గం అధ్వానంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్డు మరమ్మతులకు లేదా కొత్త రోడ్డు నిర్మాణం కోసం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. కదిరి సమీపంలోని గట్ల వద్ద గత ప్రభుత్వం టిట్కో గహాలను 90 శాతం పూర్తి చేసింది. వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారం చేపట్టాక ఆగిపోయిన టిడ్కో ఇళ్ల నిర్మాణంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అలాగే మైనార్టీ విద్యార్థుల కోసం కళాశాల దాదాపు 80 శాతం పూర్తి అయింది. ఆగిన కళాశాల నిర్మాణంపై కూడా పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల వేళ ప్రజలను మభ్యపెట్టి తిరిగి ఓట్లు దండుకోవాలని చూస్తున్నారే తప్ప అభివృద్ధి,సంక్షేమంపై ఎలాంటి హామీలు ఇవ్వకపోవడంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గత నెలలో బస్సు యాత్ర పేరుతో కదిరికి వచ్చిన ముఖ్యమంత్రి జగన్ ముస్లిం మైనార్టీలు అధిక సంఖ్యలో ఉన్న కదిరి పట్టణంలో వారి సంక్షేమం కోసం ఎలాంటి హామీలు ప్రకటించకపోవటంపై కూడా ఆసామాజికవర్గంలో అసంతృప్తి కన్పిస్తోంది. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తమ ప్రచారంలో అభ్యర్థులు ప్రజా సమస్యలపై దృష్టి సారించకుండా కేవలం ప్రత్యర్థి పార్టీని, అభ్యర్థులను విమర్శించడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో గెలుపొందే నాయకుడైనా కదిరి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

ప్రారంభానికి నోచని మైనార్టీ కళాశాల భవనాలు

భూముల కబ్జాకే భూ యాజమాన్యహక్కు చట్టం

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట

ప్రజాశక్తి - కదిరి, టౌన్

ప్రజల భూముల్ని కబ్జా చేయడానికి ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని ముఖ్యమంత్రి జగన్ తీసుకొచ్చారని టిడిపి కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతు దేశంలో ఇప్పటివరకు ఏ రాష్ట్రంలో కూడా ఈ చట్టం అమలు చేయడం లేదని అన్నారు. అలాంటిది రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం 2023 అక్టోబర్ 31 నుంచే అమల్లోకి ఈ చట్టం వచ్చినట్లు జీవో నెంబర్ 512 ను తెచ్చిందని తెలిపారు. ఈ చట్టం వలన ప్రజలు తమ భూములను కోల్పోవాల్సి వస్తుందని ఇది పూర్తిగా భూభక్ష చట్టమని దీనిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని అన్నారు. ఎన్నికల్లో ప్రజల్ని మోసం చేయడానికి ఈ చట్టానికి ఇంకా మార్గదర్శకాలు ఇవ్వకుండా నాటకాలు ఆడుతు న్నారని ఆరోపించారు. ల్యాండ్, సాండ్, వైన్, మైన్, గంజాయి, డ్రగ్స్ ఎర్రచందనం, రేషన్ బియ్యం తదితరాలను కొల్లగొట్టడం ద్వారా రూ. 8 లక్షల కోట్లు స్వాహా చేశారని ఆరోపించారు.

విలేకరులతో మాట్లాడుతున్న కందికుంట

టీడీపీలో పలువురు చేరిక : కదిరి రూరల్ కదిరి ముత్యాల చెరువు పంచాయితీ గొల్లోల చెరువుకి చెందిన సుమారు 20 వైసీపీ కుటుంబాలు టిడిపిలో చేరాయి.కదిరి తెలుగుదేశం ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్ వారికి పార్టీ కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. గ్రామ వాలంటరీ కార్తిక్‌తో పాటు పి. నవీన్, పి.నరేంద్ర, పి. కార్తిక్, జి.నారాయణ, వి. దనుంజయ్, బి. ఆంజనేయులు, బి.నారాయణస్వామి, ఎల్.బాలు, ఎల్.రవి తదితరులు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిల్ కుమార్, రమణ రెడ్డి, శ్రీనివాసులు, కౌలే పల్లి రమేష్ బాబు, ఉతన్న, శిల్పం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో గిరిజనులకు పెద్దపీట



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

గిరిజనులకు అన్ని రంగాల్లో పెద్దపీట వేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎస్‌టి కమిషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం శిల్పారామంలో జిల్లా గిరిజన సంఘం అధ్యక్షుడు పి. తిరుపాల్ నాయక్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న శంకర్‌నాయక్ మాట్లాడుతూ గిరిజనుల జనాభా ప్రాతిపదికన ఒక ఉపముఖ్యమంత్రి, ఒక మంత్రి పదవిని గిరిజనులకు జగన్ కట్టబెట్టారని గుర్తు చేశారు. ఉమ్మడి అనంత జిల్లాలో తనను రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడుగా, మరో గిరిజనులు అశ్వర్థ నాయక్ ను టీటీడీ బోర్డు సభ్యులుగా నియమించారన్నారు. టిడిపి హయాంలో గిరిజనుల అభివృద్ధికి రూ. 5 వేలకోట్లు కేటాయిస్తే అదే జగన్ రూ. 20 వేల కోట్లు కేటాయించారన్నారు. ఈ ఎన్నికలలో మరొకసారి వైసీపీని గెలిపించి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా గిరిజనులలో చైతన్యం తెస్తామన్నారు. ఈ సమావేశంలో గిరిజన ప్రజా సమాఖ్య అధ్యక్షులు మల్లికార్జున నాయక్, రాష్ట్ర గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పెడపల్లి శ్రీనివాస్ నాయక్, గోరంట్ల జడ్పిటిసి పాలే జయరాం నాయక్, హనుమ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సవితమ్మ సమక్షంలో టిడిపిలో చేరిన వైసిపి నాయకులు

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

రొద్దం : మండలంలోని తురకలాపట్నం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు శుక్రవారం టిడిపిలో చేరారు. సీనియర్ వైసిపి నాయకుడు, కలిపి సింగిల్ విండో ప్రెసిడెంట్ కెపి.శ్రీనివాసులు, శివశంకర్, నాగేష్, నల్లూరు గ్రామానికి చెందిన పూల ఓబులేసు, కలిపి మరువపల్లి గ్రామానికి చెందిన బికె.దొడగట్టప్ప, నాగేష్, తదితరులు టిడిపిలో చేరగా వారికి పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ పసుపు కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు గోరుకు శ్రీనివాసులు, హరికృష్ణ, షణ్ముఖ, నాగభూషణం, నల్లూరు నాగరాజు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘన

బొమ్మనహాల్ : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమయం దగ్గర పడడంతో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రలోభాలకు తెరతీశాయి. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఆయా పార్టీల నాయకులు ఓటర్లను ఆకట్టుకోవడానికి డబ్బు, మద్యం, చికెన్, తదితర తాయిలాలు డోర్ డెలివరీ చేస్తున్నారు. అయినా ఎన్నికల అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదు. పోలీసులు, రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది కూడా మౌనం వహిస్తున్నారు. ఇక కర్నాటక సరిహద్దులోని చెక్ పోస్ట్‌లో తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. బైక్‌లు, ఆటోలు, టిప్పర్లు, తదితర వాహనాల ద్వారా కర్నాటక నుంచి ఎపిలోకి డబ్బు, మద్యం యథేచ్ఛగా తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇకనైనా అధికారులు అప్రమత్తమై వాటిని నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి: సిఐ

ముదిగుబ్బ : సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని రూరల్ సిఐ కష్ణంరాజు నాయక్ కోరారు. మండలంలోని మలకవేముల క్రాస్‌లో ఉన్న పట్నం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సిఐ అన్ని రాజకీయ పార్టీల నాయకుల తో సమావేశం నిర్వహిం చారు. సిఐ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎవరూ ఎలాంటి గొడవలు, అవాంఛనీయ సంఘటన లకు దిగరాదని, ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. సమా వేశంలో ఎస్ఐ నరసింహుడు, పట్నం పోలీస్ స్టేషన్ సిబ్బంది, అన్ని పార్టీల రాజకీయ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

ఫ్యాక్షన్ గ్రామాల్లో పోలీసు కవాతు

మండలంలోని టిఎన్ పాళ్యం, మల్లేపల్లి, నాగారెడ్డిపల్లి, మంగళమడక గ్రామాల్లో శుక్రవారం రూరల్ సిఐ కృష్ణంరాజునాయక్, ఎస్ఐ నరసింహుడు ఆధ్వర్యంలో పోలీస్ కవాతు నిర్వహించారు. వీరు మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల ప్రకారం 144 సెక్షన్ 30 యాక్ట్ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. ఎక్కడా గుంపులుగా జనం ఉండరాదని, ఎవరు ఎలాంటి అల్లర్లకు పాల్పడకుండా ఉండాలని, ఎవరైనా ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముదిగుబ్బలో వర్షం

ముదిగుబ్బ : మండలం కేంద్రమైన ముదిగుబ్బలో శుక్రవారం వర్షం కురిసింది. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో వర్షం కురవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తీవ్రమైన ఎండలు, ఉక్క పోతతో ఇబ్బందులు పడుతున్న జనం వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి ఉపశమనం పొందారు.

వైసిపికి మద్దతుగా గిరిజన నాయకుల ప్రచారం

ముదిగుబ్బ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని మూడు తండాల్లో జడ్పిటిసి తిరుమల సేవే నాయక్ ఆధ్వర్యంలో వైసిపి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేపట్టారు. వారు ముక్తాపురం తండా, నేలకోట తండా, గరుగు తండాల్లో ఇంటింటికీ వెళ్లి జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రచారంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ వడిత్యా శంకర్‌నాయక్, కెపి.కుళ్లాయప్ప నాయక్, తిరుపాల్‌నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వక్క రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తాం

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు

ప్రజాశక్తి-మడకశిర

టిడిపి అధికారంలోకి వస్తే వక్క తోటల పెంపకం చేపట్టిన రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం వారు అమరాపురం మండలంలోని హలుకూరు, గౌడనకుంట, అమరాపురం పంచాయతీల్లో రోడ్ షో చేపట్టారు. వారు మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన అమరాపురం మండలంలో ఎక్కువ మంది రైతులు వక్క తోటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని వారికి మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వక్క రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అలాగే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని చెరువులను హంద్రీనీవా నీటితో నింపుతామన్నారు. ఐదేళ్ల వైసిపి పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, రాష్ట్రంలో సుపరిపాలన కావాలంటే టిడిపిని గెలిపించుకోవాలని కోరారు. ఎన్నికల్లో ప్రతిఓటరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎంఎస్.రాజును ఎమ్మెల్యేగా, బికె.పార్థసారధిని ఎంపిగా అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. రోడ్ షోలో నరసింహమూర్తి, మండల కన్వీనర్ గణేష్, శివరుద్రప్ప, జయరామప్ప, కృష్ణమూర్తి, విశ్వనాథ్, ఉగ్రనరసింహ, చిన్నలింగప్ప, జిల్లా జనసేన అధ్యక్షుడు చంద్రశేఖర్, మహిళలు పాల్గొన్నారు.

టిడిపి అభ్యర్థులను గెలిపించండి : హాస్యనటుడు సప్తగిరి

సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులను గెలిపించాలని సినీ హాస్యనటుడు సప్తగిరి ప్రజలను కోరారు. టిడిపి అభ్యర్థులకు మద్దతుగా సప్తగిరి శుక్రవారం అమరాపురం మండలంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎంఎస్ రాజు ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ఇక్కడి ప్రజల అదృష్టం అన్నారు.

ప్రచార రథంపై నుంచి మాట్లాడుతున్న అభ్యర్థి ఎంఎస్ రాజు

ఎంఎస్ రాజుతోనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని అందుకు నేను భరోసా ఇస్తున్నానని తెలిపారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని మండిపడ్డారు. ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా ఎంఎస్.రాజును, ఎంపిగా బికె.పార్థసారథిని గెలిపించాలని కోరారు. జూన్ 4వ తేదీ ఎంఎస్ రాజు విజయోత్సవ ర్యాలీలో పాల్గొంటానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మండల కన్వీనర్ గణేష్, నాయకులు నరసింహమూర్తి, కృష్ణమూర్తి, ఉగ్రనరసింహ, రామిరెడ్డి, శివరుద్రప్ప, మంజునాథ్, దాదు పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిన వార్డ్ మెంబర్ గోవిందప్ప, తదితరులు

టిడిపి అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి-మడకశిర

సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కుంచితి వక్కలిగా రాష్ట్ర కన్వీనర్ వి‌ఎం.పాండురంగప్ప కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన స్థానిక టిడిపి శ్రేణులతో కలిసి రొళ్ల మండలంలోని హెచ్‌టి.హళ్లి, వద్రహట్టి గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రతిఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా ఎంఎస్ రాజును, ఎంపిగా బికె.పార్థసారధిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం మల్లినమడుగు పంచాయితీ వద్రహట్టి గ్రామానికి చెందిన వార్డ్ మెంబర్ గోవిందప్ప, అనుచరులతో కలిసి వైసిపిని వీడి టిడిపిలో చేరారు. వారికి టిడిపి కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దాసిరెడ్డి, బి.నారాయణప్ప, చిక్కన్న, రాజన్న, శ్రీరంగప్ప, జనసేన నాయకుడు రంగస్వామి, రామకృష్ణ, ముదిరాజ్ మారేగౌడ్, రమేష్, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఎంపిటిసి టిడిపిలో చేరిక

రాయదుర్గం రూరల్ : మండలంలోని మెచ్చిరి వైసిపి ఎంపిటిసి శ్యామల శుక్రవారం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు సమక్షంలో టిడిపిలో చేరారు. ఎంపిటిసితో పాటు నలుగురు వార్డ్ మెంబర్లు పట్టణంలోని కాలవ నివాసంలో టిడిపిలో చేరగా వారికి పసుపు కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఎంపిటిసి శ్యామల, వార్డ్ మెంబర్లు అనురాధ, గంగమ్మ, రాజన్న, మరి కొందరు టిడిపిలో చేరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతు, నాగరాజురెడ్డి పాల్గొన్నారు.

రాయదుర్గంలో బీఎస్పీ అభ్యర్థి భారీ ర్యాలీ

రాయదుర్గం : ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పట్టణంలో బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) ఎమ్మెల్యే అభ్యర్థి చిందనూరు నాగరాజు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ స్థానిక శాంతినగర్‌లోని జమ్మి చెట్టు దగ్గర నుంచి ప్రారంభమై వినాయక సర్కిల్ మీదుగా లక్ష్మం బజార్, ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ వరకూ సాగింది. ప్రతి ఓటరూ 13వ తేదీ పోలింగ్ రోజున ఏనుగు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ర్యాలీలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర గౌరవాధ్యక్షులు జయంతి వెంకటేష్, జిల్లా అధ్యక్షులు సిరుగుప్ప వెంకటేష్, రాష్ట్ర కార్యదర్శి కలవల సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్, శబరీష్ సురేష్, తదితర ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

సిఎం జగన్ క్రైస్తవుల పాలిట సైతాన్

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

వైసిపి ప్రభుత్వం, సిఎం జగన్ క్రైస్తవులను కేవలం ఓటు బ్యాంకు గానే చూస్తూన్నారని స్టీల్ ప్లాంట్ సాధన కమిటీ అధ్యక్షుడు నాదల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నా ఎస్సీ, నా ఎస్టీ బిడ్డలకు అండగా నేను ఉన్నాను అని చెప్పి క్రైస్తవులను నమ్మించి మోసం చేశారని, జగన్ క్రైస్తవుల పాలిట సైతాన్‌లా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రైస్తవుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న 27 పథకాలను జగన్ అధికారంలోకి వచ్చాక రద్దు చేశారని మండిపడ్డారు. చంద్రబాబు పాలనలో 277 చర్చి నిర్మాణాలు జరగ్గా, జగన్ ఒక్క చర్చి నిర్మాణానికి కూడా సాయం చెయ్యలేదని విమర్శించారు. జెరూషలేం యాత్రకు చంద్రబాబు 2500 మందిని పంపిస్తే జగన్ ఒక్కరినీ కూడా పంపించలేకపో యారని దుయ్యబట్టారు. చంద్రబాబు మరోసారి అధికారంలోకి వస్తారని క్రిస్టియన్లు టిడిపి వైపే ఉన్నారన్నారు. జగన్ చేతిలో మరోసారి మోసపోవటానికి క్రిస్టియన్లు సిద్ధంగా లేరన్నారు. ఎన్‌డిఎ కూటమి తరపున ఎమ్మెల్యే, ఎంపి స్థానాలకు పోటీ చేస్తున్న కాలవ శ్రీనివాసులు, అంబికా లక్ష్మీనారాయణను గెలిపించేందుకు క్రైస్తవులు సిద్ధంగా ఉన్నారన్నారు.

జెవివి ఆధ్వర్యంలో పీపుల్స్ మేనిఫెస్టో విడుదల

ప్రజాశక్తి-సోమందేపల్లి

పెనుకొండ పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో శుక్రవారం జన విజ్ఞాన వేదిక జోన్ కమిటీ ఆధ్వర్యంలో పీపుల్స్ మేనిఫెస్టోను విడుదల చేశారు. జెవివి నాయకులు మాట్లాడు తూ అన్ని రాజకీయ పార్టీలు, వారి అభ్యర్థులకు ఎన్నికల వేళ కొన్ని డిమాండ్లు చేశారు. నాణ్యమైన, శాస్త్రీయమైన సమాజానికి ఉపయోగపడే విద్య, అందరికీ సమాన వైద్యం, అన్ని సదుపాయాలు గల ఆసుపత్రులు, అర్హతకు తగ్గ గౌరవప్రదమైన ఉపాధి చూపించాలన్నారు. పర్యావరణం విష వాయువులు, కలుషితాలతో నిండకుండా చర్యలు తీసుకోవాలని, చట్టబద్ధమైన, రాజ్యాంగ బద్ధమైన పాలన కావాలని, అవినీతి, ప్రలోభాలకు పాల్పడకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలన్నారు.

పీపుల్స్ మేనిఫెస్టో విడుదల చేస్తున్న జెవివి నాయకులు

మద్యపాన నిషేధం అమలు చేయాలని, ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, శాస్త్రీయ దృక్పథాలను రక్షించాలన్నారు. కార్యక్రమంలో జెవివి జిల్లా కార్యదర్శి హరి, జోన్ కమిటీ అధ్యక్షులు నబి, జోన్ ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్ బాషా, ఘనగిరి స్కూల్ కరస్పాండెంట్ ఇలియాజ్, లెక్చరర్ రామన్న, కోగిర జయచంద్రారెడ్డి, యుటిఎఫ్ నేత రమేష్, నరసింహ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

పుట్టపర్తి : కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ మండల కన్వీనర్ బెల్లం నజీర్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన కొత్త చెరువులోని బీసీ కాలనీ, కుమ్మర కాలనీ, మసీదు వద్ద ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి పాలనతో ప్రజలు విసుగు చెందారన్నారు. మోదీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మతాన్ని ఉపయోగించుకుని ఓట్లు వేయించుకొని లబ్ధి పొందుతుందన్నారు. మైనార్టీల రిజర్వేషన్లను తొలగించేందుకు సిద్ధమైందన్నారు. కాంగ్రెస్‌తోనే ఎపికి ప్రత్యేకహోదా, విభజన హామీల అమలు సాధ్యమన్నారు.ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా మధుసూదన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు షామీర్ బాయ్, సనావుల్లా, రశీద్, రామంజి, ఇమ్రాన్ బాబా, తదితరులు పాల్గొన్నారు.

బ్యాలెట్ నమూనాపై అవగాహన

తనకల్లు : టిడిపి ఆధ్వర్యంలో శుక్రవారం ఓటర్లకు బ్యాలెట్ నమూనాపై విస్తృత అవగాహన కల్పించారు. టిడిపి నాయకురాళ్లు చాకివేలు శిరీష, తోట సరోజమ్మ ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు ఓటర్ల వద్దకు వెళ్లి ఈవిఎంలో ఓటు ఎలా వేయాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. అలాగే చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి కదిరి ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్‌ను, హిందూపురం ఎంపిగా బికె. పార్థసారధిని అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ కాలనీ నుంచి ప్రచారం ప్రారంభించి అన్ని వీధులు విస్తృతంగా పర్యటించారు. కార్యక్రమంలో నాయకులు మహబూబ్ బాషా, ఉపాధ్యక్షుడు చిన్న కుళ్లాయప్ప, దస్తగిరి, ప్రసాద్, చంద్రప్ప, రమణ, బోడెన్న, డప్పు రమణ, మహిళలు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

మడకశిర : పట్టణంలోని బాలాజీనగర్ టిడిపి కార్యాలయంలో శుక్రవారం గుడిబండ మండలంలోని మందలపల్లి, దిన్నెహట్టి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు అడ్వకేట్ రంగనాథ, శ్రీరామ, కరియన్నతో పాటు మందలపల్లి ఎస్సీ కాలనీకి చెందిన 30 వైసిపి కుటుంబాలు టిడిపిలో చేరారు. వారికి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి టిడిపి కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారు మాట్లాడుతూ వైసిపిలో ఎలాంటి అభివృద్ధి జరగ లేదని, టిడిపితోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి పార్టీలో చేరామని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మద్దనకుం టప్పు, చిన్న మారెప్ప, మందలపల్లి పంచాయతీ నాయకులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల్లో పటిష్ట నిఘా

రొద్దం : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మండలంలోని పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిలో కర్నాటక సరిహద్దులో ఆర్.మరవపల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను శుక్రవారం జిల్లా ఎలక్షన్ అబ్జర్వర్లు పరిశీలించారు. చెక్‌పోస్టులో క్షుణ్ణంగా తనిఖీలు చేయలని అక్కడి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. విధులు సక్రమంగా నిర్వహిస్తూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ముఖ్యంగా రాత్రి వేళ తప్పనిసరిగా వాహనాలను తనిఖీ చేయాలన్నారు.

టిడిపిని గెలిపిస్తే రాప్తాడు రూపు రేఖలు మారుస్తాం

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పార్థసారధి, సునీత

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

సార్వత్రిక ఎన్నికల్లో టిడిపిని గెలిపిస్తే రాప్తాడు నియోజకవర్గ రూపురేఖలే మార్చేస్తామని ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులు బికె.పార్థసారధి, పరిటాల సునీత పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం వారు మండలంలోని ఎన్ఎస్ గేట్, దామాజిపల్లి, చెన్నేకొత్తపల్లిలో పర్యటించారు. చెన్నేకొత్తపల్లిలో రోడ్‌షో వారితో పాటు పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. రోడ్ షోకు అనూహ్య స్పందన కనిపించింది. భారీ గజమాలలతో ఘన స్వాగతం పలికారు. పూల వర్షం కురిపించారు. పరిటాల సునీత మాట్లాడుతూ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఆయన సోదరుల దౌర్జన్యాలు, అరాచకాలను తట్టుకోలేక వైసిపి శ్రేణులు టిడిపిలో చేరుతుంటే జీర్ణించుకోలేక దాడులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తోపుదుర్తి గ్రామంలో రాజారెడ్డి అనుచరులు ఎస్సీ, బీసీలపై దాడులు చేశారని, దానికి కచ్చితంగా మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. నా మెజార్టీ ఎమ్మెల్యే స్వగ్రామం తోపుదుర్తి నుంచే ప్రారంభమవుతుందన్నారు. జూన్ 4వ తేదీ తర్వాత ఎమ్మెల్యే సోదరుల మెంటల్ కూడా తగ్గిస్తామని ఘాటుగా స్పందించారు. స్థానిక వైసిపి నాయకులు ఇళ్ల మీద పడి దాడులు చేస్తుంటే వంత పోలీసులు ఎక్కడున్నా మూల్యం చెల్లించుకోవాల్సిందే అన్నారు. ఆత్మకూరు, చెన్నేకొత్తపల్లి మండలాల్లోనూ మెజార్టీ భారీగా ఉంటుందన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పార్థసారధి, సునీతతో పటు పరిటాల శ్రీరామ్‌కు గజమాల వేస్తున్న తెలుగుతమ్ముళ్లు

'తోపుదుర్తి' అరాచకాలను తొక్కేస్తాం : పరిటాల శ్రీరామ్

పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ ప్రజల ఉత్సాహం చూస్తుంటే అప్పుడు టిడిపి అధికారంలోకి వచ్చినట్టుందన్నారు. మీ ఉత్సాహం, ప్రభుత్వంపై ఉన్న కోపాన్ని 13వ తేదీ పోలింగ్ బూత్‌లలో చూపించాలన్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి సోదరుల అరాచకాలకు అత్యంత బాధింపబడింది చెన్నేకొత్తపల్లి మండలమే అన్నారు. ఇక్కడ భూ దోపిడీ పేరుతో జరిగిన అరాచకం అంతా ఇంతా కాదన్నారు. ముఖ్యంగా బీసీలపై ఇష్టానుసారం దాడులకు పాల్పడ్డారని, మీలాంటి వారిని కోసమే చంద్రబాబు రక్షణ చట్టాన్ని తీసుకొస్తారన్నారు. తోపుదుర్తి సోదరుల అరాచకాలను కాలి కింద వేసి తొక్కే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. టిడిపి శ్రేణులు ఆవేశానికి లోనుకాకుండా ఓటింగ్ సజావుగా జరిగేలా చూడాలన్నారు.

పచారంలో పాల్గొన్న కాంగ్రెస్ అభ్యర్థి నరసింహులు

కాంగ్రెస్ అభ్యర్థి నరసింహులు ప్రచారం

గోరంట్ల : మండలంలోని గౌనివారిపల్లి, కమ్మరవాండ్లపల్లి, కొండాపురం గ్రామాల్లో శుక్రవారం పెనుకొండ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నరసింహులు ముమ్మరంగా ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన ఇంటింటికీ వెళ్లి హస్తం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్‌తోనే ఎపికి ప్రత్యేకహోదా, విభజన హామీల అమలు సాధ్యమన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ అందుతుందన్నారు. అలాగే మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

రఘువీరా సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మైనారిటీ నాయకులు

వైసిపి మైనారిటీ నాయకులు కాంగ్రెస్‌లో చేరిక

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని ఆరేపేటకు చెందిన వైసిపి మైనార్టీ నాయకులు అన్సర్, ఇనాయత్, నాఫీ, ఆజాద్, షాహిద్, బాబు, శివ, తదితరులు శుక్రవారం మండలంలోని నీలకంఠాపురంలో సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరారెడ్డి నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి రఘువీరా కాంగ్రెస్ పార్టీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని నమ్మి పార్టీలో చేరామని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కె.సుధాకర్ విజయానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. వైసిపి పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు.

'బిటిపికి కృష్ణా జలాలు తీసుకురావడం జగన్‌కు ఇష్టం లేదు'

రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి రైతుద్రోహి.. కూటమి అభ్యర్థులను గెలిపించండి : కాపు

ప్రజాశక్తి-రాయదుర్గం

భైరవాణి తిప్ప ప్రాజెక్టు(బిటిపి)కి కృష్ణా జలాలు తీసుకురావడం సిఎం జగన్‌కు ఎంత మాత్రం ఇష్టం లేదని, కావున సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని తాజా మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి సూచించారు. కాపు శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమా వేశంలో మాట్లాడారు. బిటి ప్రాజెక్టుతో పాటు కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లోని చెరువు లకు నీరందించేందుకు కృష్ణా జలాల ఎత్తిపోతల పథకం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. 2019 ఎన్నికల్లో తాను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక బిటిపికి కృష్ణా జలాల ఎత్తిపోతల పథకం చేపట్టాలని సిఎం జగన్‌ను కోరగా రాప్తాడు తాజా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి బిటిపికి ఎత్తిపోతల పథకం అవసరం లేదని సిఎంకు లేఖ రాసి రైతు ద్రోహిగా నిచిచారని తెలిపారు. 2020లో తాను మరోమారు సిఎంను కలిసి బిటి ప్రాజెక్టుకు ఎత్తిపోతల పథకం గురించి వివరించగా 2021 జూలై 8వ తేదీ వైఎస్ఆర్ జయంతి రోజున సిఎం జగన్ రాయదుర్గంలో పర్యటనలో బిటిపి ఎత్తిపోతల పథకం చేపట్టి 60 రోజుల్లో యుద్ధప్రాతి పదికన పనులు చేపడతామని హామీ ఇచ్చారని, 2023 జూలై 8న కళ్యాణదుర్గం వచ్చినప్పుడు ఇదే మాట చెప్పి విస్మరించారని గుర్తు చేశారు. ప్రాధాన్యత గల పథకాలను ప్రామాణికంగా చేస్తానని చెప్పినా ఇంతవరకు చేయలేదన్నారు. మొన్న కళ్యాణదుర్గం పర్యటనలో కూడా సిఎం జగన్ బిటిపి ఎత్తిపోతల పథకం గురించి ప్రస్తావించలేదని, అలాంటప్పుడు వైసిపిని గెలిపించా ల్సిన అవసరం ఏముందని ఓటర్లకు సూచించారు. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి బిటిపికి నీరు తేలేకపోతే రాజకీయ సన్యాసం చేస్తానన్నారు. ఆయన రాజకీయ సన్యాసం చేయడం వల్ల ఈ ప్రాంతం ప్రజలు, రైతులకు ఒరిగేదేమీ లేదన్నారు. మెట్టు వెంట తిరిగే నాయకులు రైతుల ఆగ్రహం చవిచూడక తప్పదన్నారు. కూటమి తరఫున రాయదుర్గంలో కాలవ శ్రీనివాసులు, కళ్యాణదుర్గంలో అమిలినేని సురేంద్రబాబు బిటిపికి తప్పక నీరు సాధిస్తామని హామీ ఇచ్చారని, కావున ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ఎంపీ, ఎమ్మెల్యేలుగా గెలిపించాలని కాపు కోరారు. తాను ప్రత్యక్షంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనకపోయినా కూటమి అభ్యర్థుల గెలుపు కోసం పని చేస్తానన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కాపు రామచంద్రారెడ్డి

'కందికుంట'కు హారతి ఇస్తున్న తెలుగు మహిళలు

'కందికుంట' విస్తృత ప్రచారం

నల్లచెరువు : కదిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ శుక్రవారం నల్లచెరువు మేజర్ పంచాయతీ ఎస్సీ కాలనీలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఏడాదికి రూ. 15000 ఇస్తామని భరోసా ఇచ్చారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా బికె.పార్థసారధిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అభివృద్ధికి పాటుపడే పార్టీని గెలిపించండి

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రయోజనాల కోసం పాటు పడే పార్టీని గెలిపించాలని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సురేంద్రబాబు కోరారు. మండలంలోని దురదకుంట గ్రామానికి చెందిన 10 మంది వైసిపి నాయకులు శుక్రవారం టిడిపిలో చేరగా వారికి సురేంద్రబాబు పసుపు కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ నెల 13వ తేదీ సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా అంబికా లక్ష్మీనారాయణను అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.

పట్టణ అభివృద్ధికి కృషి : అమిలినేని

ఎమ్మెల్యేగా గెలిపిస్తే కళ్యాణదుర్గం పట్టణ అభివృద్ధికి విశేష కృషి చేస్తానని టిడిపి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు హామీ ఇచ్చారు. స్థానిక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కళ్యాణ మండపంలో శుక్రవారం ఆర్యవైశ్య సంఘం నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అమిలినేని మాట్లాడుతూ దౌర్జన్యాలు, దాడులు, అవినీతి, అక్రమాలకు తావు లేకుండా పట్టణ అభివృద్ధి కోసం పని చేస్తానని తెలిపారు. ప్రధానంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్య పరిష్కారం కోసం తక్షణ చర్యలు చేపడతామన్నారు. అన్ని వర్గాల ప్రజలు బాగా ఆలోచించి అభివృద్ధి చేసే పార్టీకే ఓటు వేసి గెలిపించాలని కోరారు.

వైసిపి నాయకులను టిడిపిలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సురేంద్రబాబు

డి.కొండాపురంలో ప్రచారంలో పాల్గొన్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు

పేదల అభ్యున్నతికి టిడిపిని గెలిపించాలి

ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పని చేస్తున్న టిడిపిని ఎన్నికల్లో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం కాలవ మండలంలోని డి.కొండాపురం గ్రామంలో రోడ్ షో నిర్వహించారు. టిడిపి పాలనలో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి జరిగిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేలా టిడిపి పని చేస్తుందన్నారు. ప్రస్తుతం నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. విద్యుత్ ఛార్జీలను పది సార్లు పెంచిన ఘనత వైసిపికే దక్కుతుందన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే బిసిలకు 50 ఏళ్లకే పింఛను ఇస్తామన్నారు. అక్రమాలు, అవినీతి, ధరల పెరుగుదలకు కారణమైన జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలన్నారు. అలాగే సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా అంబికా లక్ష్మీనారాయణను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ సాయానికి రుణం తీర్చుకోండి..

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి

ప్రజాశక్తి-డి.హీరేహాల్

సిఎం జగన్ రాష్ట్ర ప్రజలకు చేసిన సహాయానికి రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందని, మరోమారు వైసిపిని ఆశీర్వదించాలని రాయదుర్గం నియోజకవర్గ వైసిపి అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మెట్టు రోడ్ షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందని తెలిపారు. పేదల సంక్షేమమే ధ్యేయం గా పని చేస్తున్న జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకొని రుణం తీర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పేదల సంక్షేమం కోసం లక్షల కోట్లు ఖర్చు చేసిన ఘనత జగన్‌దే అన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని జగన్ అమలు చేశారన్నారు. చంద్రబాబు హామీలు నమ్మి ఏ ఒక్క ఓటరూ మోసపోవద్దని సూచించారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వన్నూరుస్వామి, వైస్ ఎంపిపి లింగప్ప, నాయ కులు రహంతుల్లా, జగదీష్, హనుమంతరెడ్డి, శివారెడ్డి, తిమ్మారెడ్డి, ఎంపిటిసి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రచార రథంపై నుంచి మాట్లాడుతున్న మెట్టు గోవిందరెడ్డి

రోడ్‌షో నిర్వహిస్తున్న అనంత వెంకటరామిరెడ్డి

ఆదరిస్తే..మరింత అభివృద్ధి.. : అనంత

ప్రజాశక్తి -అనంతపురం

రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేసి చూపుతానని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నగరంలో రోడ్‌షో నిర్వహించారు. నగరంలోని గుత్తి రోడ్డు నుంచి ప్రారంభమైన రోడ్‌షో పాతూరు వరకూ సాగింది. ఈ సందర్భంగా కార్యకర్తలు, అభిమానులు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తాను అధికారంలోకి వచ్చాక అభివృద్ధి చేసి అనంతపురం రూపురేఖలు మార్చామన్నారు. ముఖ్యంగా రోడ్ల నిర్మాణం చేపట్టి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దామన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి అసెంబ్లీకి పంపితే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ వసీం, నాయకులు శ్రీనివాసరెడ్డి, జెఎం బాషా పాల్గొన్నారు.

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని 43వ డివిజన్ కార్పొరేటర్ ఇషాక్ ఆధ్వర్యంలో బుడుబుక్కల కులం నుంచి 150 కుటుంబాలు వైసిపిలో చేరాయి. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. నగరాభివృద్ధి, నగర ప్రశాంతత అనంతన్నతోనే సాధ్యమని వైసిపిలో చేరినట్లు బుడుబుక్కుల కుటుంబ సభ్యులు తెలిపారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన

టిడిపి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు అంబికా, గుమ్మనూరు

ప్రజాశక్తి-గుత్తి

టిడిపి అధినేత చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుంటేనే సుపరిపాలన సాధ్యమని ఆ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు అంబికా లక్ష్మీనారాయణ, గుమ్మనూరు జయరామ్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక రాజీవ్‌గాంధీ సర్కిల్ నుంచి గాంధీ కూడలి, సిఎస్ఐ చర్చి, ఎన్జీఆర్ సర్కిల్ మీదుగా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయితే సూపర్ సిక్స్ పథకాల ద్వారా పేదలకు లబ్ధి చేకూరుతుందన్నారు. ముఖ్యంగా గుత్తి, పామిడి పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. కావున వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, నాయకులు గుమ్మనూరు నారాయణ, కేసి.హరి, ఎంకె.చౌదరి, కేశవ నాయుడు, బర్ధివలి, పి.రవితేజ, నారాయణస్వామి, దిల్కాశీనా, జక్కలచెరువు గోవిందు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో మాట్లాడుతున్న గుమ్మనూరు జయరామ్

పామిడి : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి చంద్రబాబును సిఎంను చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరామ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పామిడిలోని సరస్వతి విద్యామందిరం నుంచి వాల్మీకి సర్కిల్ వరకూ రోడ్‌షో నిర్వహించారు. ఇందులో భాగంగా తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎద్దులపల్లి సర్కిల్ దగ్గర ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. నియోజకవర్గంలో ఎవరు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని, మీకు అండగా తానున్నానని భరోసా ఇచ్చారు. కావున వచ్చే ఎన్నికల్లో టిడిపి ఓటు వేయాలని కోరారు. కాగా మండలంలోని తంబళ్లపల్లి గ్రామంలో పది కుటుంబాలు టిడిపిలో చేరాయి. వీరికి గుమ్మనూరు జయరామ్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుమ్మనూరు ఈశ్వర్, బొల్లు శ్రీనివాసరెడ్డి, లక్ష్మీకాంతమ్మ, కత్తిమల ప్రభాకర్, గౌస్, జింకల సంజీవకుమార్, అడ్వకేట్ చంద్రాచర్ల హరి, ఆర్.ఆర్. రమేష్, బొమ్మా మోహన్, కొట్టం మాలిక్, ముసలిరెడ్డి, కరూర్ శివ, జనసేన ధన, పెద్ద రంగనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి హయాంలోనే అభివృద్ధి

ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి, రాష్ట్ర నాయకులు ప్రభాకర్‌చౌదరి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురంలో టిడిపి హయాంలో చేసిన అభివృద్ధిని వైసిపి నాయకులు తాము చేశామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి అన్నారు. శుక్రవారం రుద్రంపేట పంచాయతీలోని వికలాంగుల కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇద్దరు నేతల కలయికతో కార్యకర్తలు, నాయకుల్లో జోష్ కనిపించింది. ఇందులో భాగంగా ప్రభాకర్‌చౌదరి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. ఈసందర్భంగా దగ్గుపాటి మాట్లాడుతూ తాము ప్రజల్లోకి వెళుతుంటే ప్రతి పనీ టిడిపి హయాంలోనే జరిగిందని చెబుతున్నారన్నారు. తమకు వస్తున్న స్పందన చూస్తుంటే కచ్చితంగా భారీ విజయం ఖాయమనిపిస్తోందన్నారు. ప్రభాకర్‌చౌదరి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలంతా వైసిపి అరాచక పాలన పోవాలని కోరుకుంటున్నారన్నారు. ప్రశాంతమైన వాతావరణం రావాలంటే వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును సిఎంను చేసుకోవాలన్నారు. నగరంలో జరిగిన జాతీయ రహదారి విస్తరణ పనులు, సుభాష్‌రోడ్డు పనులన్నీ టిడిపి హయాంలోనే మంజూరయ్యాయని గుర్తు చేశారు. తాను నగరానికి తాగునీటి సమస్య లేకుండా చేస్తే.. చిన్న మోటార్ రిపేరు వచ్చిందని 10రోజులపాటు తాగునీరు ఇవ్వలేని దుస్థితిలో వైసిపి ప్రభుత్వం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కావున వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి దగ్గుపాటిని గెలిపించడంతోపాటు చంద్రబాబును సిఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు.

అనంతలో బీసీ భవన్ నిర్మిస్తాం..

టిడిపి అధికారంలోకి రాగానే అనంతపురంలో బీసీ భవన్ నిర్మిస్తామని దగ్గుపాటి ప్రసాద్ హామీ ఇచ్చారు. శుక్రవారం నగరంలోని యాదవ్ ఫంక్షన్ హాల్లో బీసీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల కోసమే టిడిపి పుట్టిందన్నారు. దీంతోనే పార్టీ ఆవిర్భావం నుంచి బిసిలకే పెద్దపీట వేస్తోందన్నారు. గతంలో జగన్ చెప్పిన మాయమాటలు నమ్మి కొందరు బీసీలు గత ఎన్నికల్లో వైసిపికి ఓటు వేశారని, ఈసారి మాత్రం ఆ తప్పు చేయరన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడుయాదవ్, బిసి నాయకులు ఆవుల కృష్ణయ్య, తలారి ఆదినారాయణ, దళవాయి వెంకట నారాయణ, జోగి రాజేంద్ర, పోతుల లక్ష్మీనరసింహులు, జనసేన నాయకులు జయరామ్‌రెడ్డి, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న టిడిపి నాయకులు

బైకు ర్యాలీ నిర్వహిస్తున్న తమ్ముళ్లు

బైక్ ర్యాలీతో కదం తొక్కిన టీడీపీ శ్రేణులు

అనంత ప్రజలారా ఇంటి నుంచి బయటకు రండి.. ఈ అరాచక ప్రభుత్వానికి ఓటు ద్వారానే బుద్ధి చెప్పండంటూ అనంతపురం అర్బన్ టీడీపీ అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సాయంత్రం దగ్గుపాటి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ అర్బన్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ప్రదర్శన రాంనగర్ ఫ్లైఓవర్, అంబేద్కర్ విగ్రహం, సప్తగిరి సర్కిల్, ఐరన్ బ్రిడ్జి, వన్ టౌన్ పీఎస్, గాంధీ సర్కిల్, శ్రీకంఠం సర్కిల్, టవర్ క్లాక్ మీదుగా బళ్లారి బైపాస్ వరకు సాగింది. సుమారు 3వేల మంది యువకులు ద్విచక్రవాహనాల్లో టీడీపీ జెండాలు పట్టుకుని ప్రదర్శనగా వచ్చారు. దగ్గుపాటి ముందుకు కదలగా.. వెనుక టీడీపీ శ్రేణులంతా సైనికుల్లా తరలివచ్చారు. జై దగ్గుపాటి అన్న నినాదాలో నగరమంతా మారు మ్రోగేలా చేశారు. ఈ సందర్భంగా దగ్గుపాటి మాట్లాడుతూ నగరంలో యువత ఉత్సాహం చూస్తుంటే.. తమ విజయం భారీ స్థాయిలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబుని ముఖ్యమంత్రి చేసుకోవాలన్న తపన యువతలో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. నగరంలో తాగునీటి సమస్యలు నెలకొన్నాయని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వస్తుందని పీఏబీఆర్ నుంచి నగరానికి సరిపడా నీరు తీసుకొస్తామన్నారు.

మంచి చేసిన వైసిపిని గెలిపించుకుందాం

ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వై.విశ్వేశ్వరరెడ్డి, శంకరనారాయణ

ప్రజాశక్తి-వజ్రకరూరు

ప్రతి కుటుంబానికీ మంచి చేసిన వైసిపి ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకుందామని వైసిపి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వై.విశ్వేశ్వరరెడ్డి, శంకరనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం విడపనకల్లు మండల పరిధిలోని వెల్పుమడుగు, హావళిగి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలు హారతులు పట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ టిడిపి పాలనలో పయ్యావుల సోదరులు నియోజకవర్గవ్యాప్తంగా హత్యా, కుటిల రాజకీయాలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేశారన్నారు. అయితే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో హత్యా రాజకీయాలను ప్రోత్సహించకుండా ప్రజలను సొంత కుటుంబ సభ్యులుగా భావించి పాలన సాగించామన్నారు. ప్రజా సంక్షేమం కోసం పోరాడే తనతో పయ్యావులకు పోలిక ఏంటని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో పయ్యావుల కేశవ్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలిపించారు. సీఎం జగన్ సంక్షేమ సురిపాలన అందిస్తుంటే, ప్రతిపక్ష పార్టీలు కుమ్మక్కై దోచుకోవడానికి చూస్తున్నాయని మండిపడ్డారు. మీకు మంచి జరిగి ఉంటేనే ఓటు వేయాలని అడిగిన ఏకైక వ్యక్తి దేశంలోనే జగన్ ఒక్కరే అన్నారు. ఎన్నికల ముందు మేనిఫెస్టోలో చెప్పిన హామీలను 99 శాతం అమలు చేసిన జగన్ కావాలో.. మోసం చేసే చంద్రబాబు కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలని కోరారు. కాగా బసవ జయంతి సందర్భంగా ఉరవకొండలోని గాంధీ బజార్‌లో ఉన్న పురాతన పేట బసవేశ్వరస్వామిని విశ్వేశ్వరరెడ్డి గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు వీరశైవ లింగాయత్ కులస్తులు పాల్గొన్నారు.

ప్రచారంలో మాట్లాడుతున్న వై.విశ్వేశ్వరరెడ్డి

బెలుగుప్ప : సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డిని గెలిపించాలని ఆయన సతీమణి భువనేశ్వరి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపిస్తేనే 'ప్రత్యేక హోదా'

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మల్లికార్జున, జాఫర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

దేశం, రాష్ట్రంలో ఇండియా వేదిక ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని, అప్పుడే రాష్ట్రానికి ప్రత్యేక హోదా, బుందేల్‌ఖండ్ ప్యాకేజీ, రాజధాని నిర్మాణం, ఉద్యోగ, ఉపాధి కల్పన సాధ్యమని వేదిక ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మల్లికార్జున, సి.జాఫర్ అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మల్లికార్జున మాట్లాడుతూ సాధారణ ఎన్నికల్లో టిడిపి, వైసిపి అభ్యర్థులు నోట్లతో ఓట్లు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ఒక పార్టీ ఆ కాలనీలో డబ్బులు పంచిన వెంటనే మరొక పార్టీ అదే కాలనీకి వచ్చి ఓటర్ల ఇంటి వద్దకే వెళ్లి డబ్బులు పంపిణీ చేసి అధికారంలోకి రావాలని చూస్తున్నారన్నారు. డబ్బులు పంపిణీ సంస్కృతి టిడిపి తీసుకొస్తే.. దాన్ని వైసిపి కొనసాగిస్తోందని విమర్శించారు. గడిచిన పదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదన్నారు. సాగు, తాగునీటి సమస్య పరిష్కారం కాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో హంద్రీనీవా ద్వారా జిల్లాకు నీటి తీసుకొచ్చామని గుర్తు చేశారు. ఆ తరువాత వచ్చిన ప్రభుత్వాలు రైతులను విస్మరించాయని దుయ్యబట్టారు. ప్రజలకు మంచి జరగాలంటే ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. టిడిపి, వైఎస్ఆర్‌సిపి పార్టీలు ఓటుకు డబ్బులు పంపిణీ చేయడం ఎన్నికల నిబంధనల మేరకు నేరం అన్నారు. ఓటర్లు ఆయా పార్టీలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. సాధ్యం కాని పక్షంలో వారు డబ్బులిస్తే తీసుకుని కాంగ్రెస్ వేదిక ఎంపీ ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.